ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- పొరపాట్లు జరగకుండా నిబంధనలు పాటించాలి
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), మే 20: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా సజావుగా జరిగేందుకు ప్రణాళికాబద్ధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ రిటర్నింగ్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి సాయి ఇంజనీరింగ్ కళాశాలలో చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన, చర్యలపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసిందని, ఇందుకు కృషి చేసిన అధికారులందరికీ అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. అలాగే జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపునకు అన్ని విధాలా సిద్ధంగా ఉండాలని, ఇందుకు ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నిబంధనల మేరకు పనులు పూర్తి చేయాలని సూచించారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో కౌంటింగ్ ప్రక్రియను మొదలు పెట్టాలని, అలాగే 8.30 గంటల నుంచి ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో నిర్దేశిత ప్రాంతంలో మీడియా కేంద్రం ఏర్పాటు చేయాలని, ఆయా నియోజకవర్గాల రౌండ్‌ల వారి ఫలితాల ప్రకటనలను మీడియా కేంద్రానికి వెంటనే పంపాలని ఆర్‌వోలకు సూచించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్ల అందరికీ శిక్షణ ఇవ్వాలని, ఇందుకు షెడ్యూల్ రూపొందించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు రోజు ఎక్కడ కూడా కౌంటింగ్ కేంద్రంలో లెక్కింపు ప్రక్రియ ఆగిపోకూడదన్నారు. వర్షం సూచన ఉన్నందున కౌంటింగ్ కేంద్రాల వద్ద రెయిన్ ప్రూఫింగ్ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. అనంతరం వివిధ అంశాల్లో అధికారులతో చర్చించి తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో డీఆర్‌వో సత్యనారాయణరావు, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అవతారమెత్తిన సెక్యూరిటీ గార్డు

- బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రిలో బాలుడికి కుట్లు



గాయపడ్డ బాలుడికి కుట్లు వేస్తున్న సీహెచ్‌సీ సెక్యూరిటీ గార్డు శ్రీనివాసులు

బి.కొత్తకోట, మే 20: అది 30 పడకల ఆస్పత్రి... నలుగురు డాక్టర్లు ఉంటారు. మూడు మండలాలకు చెందిన ప్రజలు ఈ ఆస్పత్రికే వస్తుంటారు. అలాంటి ఆస్పత్రిలో ఓ సెక్యూరిటీ గార్డు డాక్టర్ అవతారం ఎత్తి దెబ్బ తగిలిన ఓ బాలుడికి కుట్లు వేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మూడు రోజుల క్రితం బి.కొత్తకోటకు చెందిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు గాయపడగా ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నా వారెవరూ ఆ బాలుడికి చికిత్స చేయకుండా అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డు శ్రీనివాసులుకు చెప్పారు. వెంటనే అతడు డాక్టర్ అవతారమెత్తి చేతులు గ్లవ్స్ వేసుకుని బాలుడికి కుట్లు వేశాడు. మీరు వైద్యం చేస్తున్నారేంటని ప్రశ్నించిన బాలుడి తండ్రికి డ్యూటీలో ఉన్న సిబ్బంది ఎవరు చేస్తే ఏంటి పని జరుగుతోంది కదా...అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వంపై పర్యవేక్షణా లోపానికి ఈ సంఘటన ఉదాహరణగా నిలుస్తోంది. యూనిఫాం వేసుకుని ద్వారం ముందు ఉండాల్సిన సెక్యూరిటీ సిబ్బంది డాక్టర్ అవతారం ఎందుకు ఎత్తాడన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది. ఈ సంఘటన బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ (సీహెచ్‌సీ)లో జరిగింది. ఈ ఆస్పత్రికి బి.కొత్తకోట, ములకలచెరువు మండలంలోని కొన్ని గ్రామాలు, పీటీయం మండలంలోని 20 పంచాయతీలకు చెందిన ప్రజలు వస్తుంటారు. చిన్నపాటి సమస్యలతో ఆసుపత్రికి వచ్చిన రోగుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తారని, ఇంజక్షన్ రూంను వినియోగించకుండా హాల్‌లోనే నిలబెట్టి ఇంజక్షన్ వేస్తారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనిపించని పదో రత్నమే.. బటన్ నొక్కుడు..



- నవరత్నాలూ బూటకమే..
- ఉత్తుత్తి నొక్కుడే...
- బటన్ నొక్కి మూడు నెలలు
- డబ్బులు పడేదెన్నాళ్లకో...
- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు



న్యాయానికి.. ధర్మానికి.. చట్టానికి ప్రతిరూపాలు మూడు సింహాలైతే.. కనిపించని నాలుగో సింహమేరా.. పోలీస్.. ఇది ఓ తెలుగు సినిమాలో హీరో చెప్పే పవర్‌ఫుల్ డైలాగ్.. అచ్చం ఈ సినిమాలో డైలాగ్ మాదిరే.. జగనన్న గొప్పగా చెప్పుకునే.. నవరత్నాలు ప్రపంచానికి తెలిస్తే.. తెలియని పదో రత్నం కూడా ఉంది. అదే లబ్ధిదారుల అకౌంట్లలోకి పైసా డబ్బు వేయకపోయినా.. ఉత్తుత్తిగా బటన్లు నొక్కడం.. అమ్మఒడి.. పేదలందరికీ ఇళ్లు.. వైఎస్సార్ ఆసరా.. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంటు, వైఎస్సార్ రైతు భరోసా వీటి గురించి ముఖ్యమంత్రి జగన్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ చాలా గొప్పగా చెబుతుంటారు. అయితే ఉత్తుత్తి బటన్లు నొక్కడం గురించి ఎవరూ నోరు మెదపరు. దీంతో ఇప్పుడు ప్రజలు ఈ పదో రత్నం బాగోతం ఏంటో..? చెబుతున్నారు.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ప్రజలకు అది చేస్తాం.. ఇది చేస్తాం అని మాయమాటలు చెప్పి 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గొప్పలు చెబుతూ ప్రజలను మోసం చేస్తోంది. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది కొద్దోగొప్పో కొన్ని పథకాలను ప్రజలకు అందించింది. ఆ తర్వాతే అసలు కథ మొదలైంది. లబ్ధిదారుల సంఖ్యలో అప్రకటిత కోత విధించింది. ఏవేవో చిత్ర విచిత్ర నిబంధనలు పెట్టి.. ఏడాదికేడాది లబ్ధిదారుల సంఖ్య పెరగకుండా జాగ్రత్తలు తీసుకుంది. చివరికి కరెంటు బిల్లును సాకుగా చూపి ఎందరో అర్హులకు నవరత్నాలు అందించలేదు. ఈ ఏడాది జనవరి నుంచి ఎన్నికల కోడ్ వచ్చే వరకు అనేక పథకాలకు నిధులు విడుదల చేస్తున్నట్లు స్వయంగా ముఖ్యమంత్రే బటన్లు నొక్కారు. అయితే లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలోకి డబ్బు మాత్రం జమ కాలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు రెండు రోజుల ముందు రాష్ట్ర ప్రభుత్వం తెగ హడావుడి చేసింది. లబ్ధిదారుల అకౌంట్లలోకి నగదు జమ చేస్తామని ఎన్నికల కమిషన్‌ను అనుమతి కోరుతూ లేఖ రాసింది. దీనికి ఎన్నికల కమిషన్ అభ్యంతరం చెప్పింది. అయితే తాము పేదలకు డబ్బు ఇస్తుంటే.. ప్రతిపక్ష పార్టీలు అడ్డుకుంటున్నాయని వైసీపీ నాయకులు నానా హంగామా చేశారు. ఎన్నికలు ముగిసిన రెండు, మూడు రోజుల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం గతంలో బటన్లు నొక్కిన పథకాలకు సంబంధించి నిధులు విడుదల చేసింది. అయితే ఇప్పటికీ చాలా మంది బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ కాలేదు. దీనిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తుత్తిగా బటన్లు నొక్కడం పదో రత్నంగా జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో పెట్టి ఉంటే బాగుండేదని ప్రజలు పేర్కొంటుండటం గమనార్హం.

ఫీజు రీయింబర్స్‌మెంటు డబ్బు రాలేదు..



చిత్తూరులో డిప్లమా చివరి సంవత్సరం చదువుతున్నాను. ప్రభుత్వం విడుదల చేసిన ఫీజు రీయింబర్స్‌మెంటు డబ్బు ఇంకా నా అకౌంటుకు రాలేదు. ఫీజు కోసం కళాశాల యాజమాన్యం ఒత్తిడి చేస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంటు పడితేనే ఇంట్లో వాళ్ల ప్రశాంతంగా ఉంటారు.

- అశ్లేష్, ఓబులవారిపల్లె

చేయూత డబ్బుల కోసం ఎదురు చూస్తున్నా..



జగన్ ముఖ్యమంత్రి అయ్యాక మూడుసార్లు మాత్రమే చేయూత డబ్బులు వచ్చింది. నాలుగోసారి జగన్ బటన్ నొక్కేశాడు. ఇంత వరకూ బ్యాంకులో పడలేదు. రోజూ బ్యాంకుకు వెళ్లి అకౌంట్ చెక్ చేయిస్తున్నా. ఎన్నికలు అయిపోగానే డబ్బులు వస్తాయని చెప్పారు. కానీ రాలేదు. ఆ డబ్బులు వస్తే, కొన్ని సమస్యలు తీరిపోతాయని ఆశగా ఎదురు చూస్తున్నాను.

- పి.గంగులమ్మ, కాట్నగల్లు, పీటీఎం

మా ఖాతాలో డబ్బు పడలేదు..



పున్నాగ అనే గ్రూపులో ఉన్నాను. మా గ్రూపులో సభ్యులకు ఒక్కొక్కరికీ ఆసరా కింద రూ.1000లోపు పడుతుంది. ఇంకా మా ఖాతాలోకి డబ్బు పడలేదు.

- డి.సుమతి, అయ్యలరాజుగారిపల్లె

ఆసరా డబ్బులు ఇంకా రాలేదు..



డ్వాక్రా గ్రూపుల్లోని మహిళలు తీసుకున్న రుణాలు మాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ఆ డబ్బులు అకౌంట్లలో వేస్తున్నట్లు చాలాసార్లు చెప్పారు. అందరి గ్రూపులకు డబ్బులు పడిందని చెబుతున్నారు. మా గ్రూపునకు ఇంత వరకూ ఒకసారి కూడా డబ్బులు రాలేదు. ఎన్నికలకు ముందు నాలుగోసారి ముఖ్యమంత్రి బటన్ నొక్కినాడని, డబ్బులు వస్తుందని మా డ్వాక్రా గ్రూపుల్లో చెబుతున్నారు. ఎన్నికలు అయిపోతానే బ్యాంకుకు పడతాయన్నారు. కానీ ఇప్పటి వరకూ పైసా సొమ్ము పడలేదు.

- ఎం.సరస్వతి, నవాబుకోట

మైన్స్ లోపాలపై డీఎంఎస్ విచారణ

- ఏపీఎండీసీ కార్మిక సంఘం నాయకుడి ఫిర్యాదుతో..



మైన్స్‌లో బ్లాస్టింగ్ పాయింట్‌లను పరిశీలిస్తున్న డీఎంఎస్ అధికారి

ఓబులవారిపల్లె, మే 20: ఏపీఎండీసీ మంగంపేట సంస్థలో సంస్థ నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న ఫిర్యాదుతో నెల్లూరు రీజియన్ డివిజన్ సేఫ్టీ అధికారి కోటంనాయుడు ఏపీఎండీసీ మైన్స్ కార్యాలయంలో సోమవారం విచారణ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బ్లాస్టింగ్ ఇన్‌ఛార్జ్‌ని నియమించకుండా రోజుకు ఒక సెకండ్ క్లాస్ మేనేజర్‌తో బ్లాస్టింగ్ చేయడం రూల్స్‌కు వ్యతిరేకమన్నారు. డీడీఎంఎస్‌కు కార్మికుల తరపున ఫిర్యాదు చేస్తే మైన్స్ మేనేజర్ అశోక్‌కు ఇన్‌చార్జ్ అప్పగించినా ఏజెంటు ఆర్డర్ ఆపుతూ ఇంకో ఆర్డర్ ఇచ్చారని, దీనిపై విచారణ జరిపి ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. అనుభవం లేని వారితో బ్లాస్టింగు చేయించడం వల్ల ప్రమాదాలు జరగడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. సర్వేయర్ బెనర్జీ రిటైర్డ్ అయిన నాటి నుంచి సర్వేయర్‌ను అధికారికంగా నియమించకనే మైనింగ్ పనులు నిర్వహించడం చట్ట విరుద్ధమన్నారు. అలాగే గత నెలలో మైన్స్ మేనేజర్‌కు తెలియకుండా కంటైనర్‌కు వెల్డింగ్ చేయించడం, ఫైర్ సేఫ్టీ పాటించకుండా కంటైనర్ కాలిపోవడంతో సుమారు రూ.10 లక్షలు ఏపీఎండీసీ సంస్థకు నష్టం చేశారని, ఈ విషయాన్ని డీడీఎంఎస్ అధికారులకు తెలియకుండా దాచారని తెలిపారు. మైన్స్ మేనేజర్‌కు తెలియకుండా ఇలాంటి చర్యలకు అనుమతి ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సిహెచ్ చంద్రశేఖర్ సమక్షంలో ఏజెంట్, సీపీవో సుదర్శన్‌రెడ్డి, మైన్స్ మేనేజర్ గోపీనాథ్, మెకానికల్ మేనేజర్ చలపతిరెడ్డిలతో డీఎంఎస్ కోటంనాయుడు విచారణ నిర్వహించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మైనింగ్‌ను, కాలిపోయిన కంటైనర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌పై అభిమానంతో...

- రక్తదానం చేసిన దివ్యాంగుడు

మదనపల్లె టౌన్, మే 20: నా ప్రాణమున్నంత వరకు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా రక్తదానం చేస్తూనే వుంటా. నన్ను ఎన్టీఆర్ అన్న వచ్చి చూసేంత వరకు నా నిర్ణయం మారదు అంటూ రెండు కాళ్లు లేని దివ్యాంగుడు తన సంకల్పాన్ని వివరించారు. సోమవారం పట్టణంలోని జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టెంపర్ రాజేశ్, రెడ్డి, గణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి బి.కొత్తకోట మండలం గోళ్లపల్లెకు చెందిన రెండు కాళ్లు లేని దివ్యాంగుడు చాంద్‌బాషా స్నేహితుల సహాయంతో వచ్చి రక్తదానం చేశాడు. ఆయన మాట్లాడుతూ 12 ఏళ్ల క్రితం రైలులో వెళుతూ కిందపడిపోవడంతో తన రెండు కాళ్లు పోయాయని, అయినా జూనియర్ ఎన్టీఆర్‌పై తన అభిమానం తగ్గలేదన్నారు. గతేడాది నుంచి జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా రక్తదానం చేయడం మొదలు పెట్టానని, ఇది కంటిన్యూ చేస్తానని చాంద్‌బాషా వెల్లడించారు.



తన అభిమాన హీరో కోసం రక్తదానం చేస్తున్న రెండు కాళ్లు లేని చాంద్‌బాషా

ఇప్పుడు కాక.. ఇంకెప్పుడు..?



వేరుశనగ కాయలు

- సబ్సిడీ వేరుశనగ విత్తనాల కోసం ఎదురుచూపులు
- కొత్త రకం వంగడం సత్ఫలితాలిచ్చేనా..?
- ముందస్తు వర్షాల రాకతో రైతుల్లో ఆనందం
- దుక్కి దున్ని పొలాలను సిద్ధం చేస్తున్న రైతన్నలు



నిమ్మనపల్లె మండలం వెంకోజిగారిపల్లె వద్ద వేరుశనగ సాగుకు దుక్కి దున్ని సిద్ధం చేసిన చేను



మదనపల్లె మండలంలో దుక్కి చేసేందుకు సిద్ధంగా ఉన్న చేను

మదనపల్లె టౌన్, మే 20: నైరుతి రుతుపవనాలు రాయలసీమకు ముందస్తుగా వస్తున్నాయని వాతావరణశాఖ చెబుతోంది. దీంతో పాటు బంగాళాఖాతంలో అల్పపీడనంతో రాబోయే మూడు రోజుల్లో రాయలసీమలో వర్షాలు పడనున్నాయి. ఇదే అదునులో జిల్లాలో వేరుశనగ విత్తేందుకు రైతులు పొలాలను దుక్కి దున్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ ఎప్పుడు చేస్తుందో అని రైతులు ఎదురు చూస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్‌లో రైతులు ఎక్కువగా వర్షాధార పంట అయిన వేరుశనగ సాగుకు మొగ్గుచూపుతారు. 2024 ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1,07,130 ఎకరాల్లో వేరుశనగ సాధారణ సాగుగా వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. దీనికోసం నాలుగు వంగడాల వేరుశనగ విత్తనాలు అవసరమని విత్తనశుద్ధి కేంద్రానికి నివేదికలు పంపారు. ఇందులో భాగంగా జిల్లాకు 55,383 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అవసరమని అధికారుల నివేదికకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, వాల్మీకిపురం, పీలేరు వ్యవసాయ డివిజన్‌లో రైతులకు ఎంత వేరుశనగ విత్తనాలు అవసరమో ఇప్పటికే ఆయా డివిజన్ వ్యవసాయ అధికారులు నివేదికలను పంపారు.

అందుకోలేని వేరుశనగ సాగు లక్ష్యం

2023-24 ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాధారణ సాగు లక్ష్యం 1,19,712 ఎకరాలుగా అధికారులు లక్ష్యం పెట్టుకుని దీనికి తగ్గట్టు 51,556 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. వాస్తవంగా ఎకరాకు 90 కిలోల వేరుశనగ విత్తనాలు అవసరమవుతాయి. దీనిని బట్టి చూస్తే గత ఏడాది వ్యవసాయశాఖ అధికారులు 57,284 ఎకరాల సాగుకు మాత్రమే సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేశారు. కానీ ఖరీఫ్ సీజన్ మొదలయ్యే జూన్ 15వ తేదీ నుంచి జూలై 15వ తేదీ వరకు సకాలంలో వర్షాలు కురవలేదు. దీంతో రైతులు ఒబ్బిడి, శుద్ధి చేసుకున్న సబ్సిడీ విత్తనాలను విత్తే ధైర్యం లేక ఇంట్లో నూనెకు, చట్నీలకు వాడుకునేశారు. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా కేవలం 43,350 ఎకరాల్లో మాత్రమే వేరుశనగ విత్తారు. వర్షాలు అదునుగా పడకపోవడంతో దిగుబడి కూడా చాలా తక్కువగా వచ్చింది. ఈ క్రమంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఊరిస్తున్న నైరుతి రుతుపవనాలు

2024-25 ఖరీఫ్ సీజన్‌లో నైరుతి రుతుపవనాలు రైతులను ఊరిస్తున్నాయి. సాధారణంగా కేరళను దాటిన నైరుతి రుతుపవనాలు జూన్ 5వ తేదీ తరువాత ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాలను తాకుతాయి. కానీ ఈసారి నైరుతి రుతుపవనాలు వారం రోజుల ముందుగానే అన్నమయ్య జిల్లాను తాకనున్నాయి. మే 31వ తేదీ నాటికే వర్షాలు పడనున్నాయని వాతావరణశాఖ స్పష్టం చేస్తోంది. అంతేకాకుండా బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల వర్షాలు కురవగా మరో మూడు రోజుల్లో ఎడతెరిపి లేకుండా వర్షం పడే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ చెబుతోంది. దీనిని బట్టి చూస్తే జిల్లాలో వేరుశనగ రైతులు ఖరీఫ్ సీజన్‌తో పనిలేకుండా ముందస్తుగానే వేరుశనగ విత్తేందుకు సిద్ధమవుతున్నారు.

ముందస్తు విత్తన పంపిణీ జరిగేనా..?

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 1,07,130 ఎకరాల సాధారణ సాగుగా వ్యవసాయశాఖ అధికారులు నిర్ణయించారు. అందుకు 55,383 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాల పంపిణీకి చర్యలు చేపట్టారు. ఇక మిగిలిన పది రోజుల సమయంలో సబ్సిడీ వేరుశనగ విత్తనాలు జిల్లా కేంద్రానికి అక్కడి నుంచి 30 మండలాలకు అందుబాటులోకి వస్తాయా అన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇప్పటికే కురిసిన వర్షాలకు చాలా చోట్ల రైతులు దుక్కి దున్ని చేళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. ముందస్తు వర్షాల కారణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందస్తుగా సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా గతేడాది జూన్ 1వ తేదీ నుంచి ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల చేతుల మీదుగా సబ్సిడీ వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. కానీ ఈసారి జూన్ 4వ తేదీ తర్వాతే కొత్త ఎమ్మెల్యేలు ఎవరో తెలియనుంది. అంతేకాకుండా కొత్త ప్రభుత్వ ఏర్పాటు తదితర అంశాలను చూసుకుంటే జూన్ 8, 9 తేదీల తరువాతనే కొత్త ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వీరి చేత వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయాలని అధికారులు తలిస్తే మాత్రం రైతుల నోట్లో మట్టికొట్టినట్లే. ఈ ఖరీఫ్‌లో మే చివరికి వేరుశనగ విత్తనాలు ఆయా మండలాలకు చేరితేనే రైతుల ఆశలు నెరవేరుతాయి.

జూన్ మొదటివారంలోనే పంపిణీ చేస్తాం..

2024 ఖరీఫ్ సీజన్‌లో సబ్సిడీ వేరుశనగ విత్తనాల సేకరణ, పంపిణీ అంశాలపై ఇప్పటికే చర్యలు చేపట్టాము. విత్తనశుద్ధి కేంద్రాల నుంచి వేరుశనగ విత్తనాలు వస్తూనే ఆలస్యం చేయకుండా ఆయా మండలాలకు కేటాయించిన మొత్తం విత్తనాలను సరఫరా చేసేస్తాం. ఎంత లేదన్నా జూన్ మొదటి వారంలోనే రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీకి రంగం సిద్ధం చేస్తున్నాము.

- చంద్రానాయక్, జిల్లా వ్యవసాయశాఖాధికారి, రాయచోటి



కొత్త వంగడాలు సత్ఫలితాలు ఇచ్చేనా..?

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రైతులకు సబ్సిడీతో నారాయణి, కే-6 వంగడాల వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తుండటం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో రైతులు కే-6 రకం సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులతో వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు రెండు కొత్త వంగడాలను కనిపెట్టారు. కదిరి లేపాక్షి రకం, విశిష్ట (టీసీజీఎస్) రకం వంగడాలను కూడా రైతులకు సబ్సిడీ ధరలతో పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 30ఏళ్లుగా రైతులు కే-6 రకం వేరుశనగసాగు చేస్తుండటంతో ఈసారి ప్రయోగాత్మకంగా కదిరి లేపాక్షి, విశిష్ట రకం విత్తనాలను కూడా వ్యవసాయశాఖ అందుబాటులోకి తీసుకురానుంది. ఈ రెండు వంగడాలు కే-6రకం కన్నా ఎక్కువ దిగుబడి ఇస్తాయని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. కాగా అన్ని రకాల వంగడాలను ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేయనున్నారు.

కమనీయం రమణీయం

చెన్నకేశవ స్వామి కల్యాణం



చెన్నకేశవస్వామి, శ్రీదేవి భూదేవి కల్యాణం



శేషవాహనంపై ఊరేగుతున్న స్వామి

రాజుపాలెం, మే 20 : వెల్లాల బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం చెన్నకేశవస్వామి శ్రీదేవి భూదేవిల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. దేవస్థానం ఆవరణంలోని సంజీవరాయ స్వామి కల్యాణమండపంలో ప్రత్యేక అలంకరణతో ఏర్పాటు చేసిన వేదికపై కల్యాణం నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక అలంకరణ చేసి ఆసనంపై కూర్చోబెట్టారు. పూలదండలు ఎదురుకోళ్లు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జీలకర్ర బెల్లం ఉంచి వేద మంత్రాల వాయిద్యాల నడుమ కల్యాణం నిర్వహించారు. ప్రతి యేటా బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. అనంతరం భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఈవో బీవీ నరసయ్య, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పుష్పగిరి హుండీ డబ్బు లెక్కింపు

రూ.3.27 లక్షల ఆదాయం



హుండీ డబ్బులను లెక్కిస్తున్న దృశ్యం

వల్లూరు, మే 20 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుష్పగిరి క్షేత్రంలో కొలువుదీరిన శ్రీకామాక్షి సమేత వైద్యనాథేశ్వర శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి హుండీలను సోమవారం లెక్కించారు. మొత్తం రూ.3,27,410 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో శ్రీనివాసులు తెలిపారు. ఈ మొత్తాన్ని బ్యాంకులో జమ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఆలయ అర్చకులు, పురావస్తు సిబ్బందితో పాటు దేవదాయ సిబ్బంది, చెన్నూరు శ్రీవెంకటేశ్వర సేవా సమితి భక్తులు లెక్కింపులో పాల్గొన్నట్లు ఈవో తెలిపారు.

అక్రమ బ్లాస్టింగ్‌ను ఆపండి

- ఇళ్లు బీటలు వారుతున్నాయి...
- సీపీఎం నాయకులతో కలిసి కాలనీవాసుల నిరసన



బ్లాస్టింగ్ ఆపాలని కాలనీ వాసులతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మదనపల్లె అర్బన్, మే 20: స్థానిక అమ్మచెరువుమిట్ట వద్ద అక్రమంగా చేస్తున్న బ్లాస్టింగ్‌తో ఇళ్లు బీటలు వారుతున్నాయని, పెద్దఎత్తున వస్తున్న శబ్దాలతో వృద్ధులు, చిన్నారులు భయాందోళనలకు గురవుతున్నారని, వెంటనే బ్లాస్టింగ్ ఆపాలని సీపీఎం నాయకులతో కలిసి స్థానికులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐటీయూసీ నాయకుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ మదనపల్లె మండలం కోళ్లబైలు రెవెన్యూ గ్రామంలో భూకబ్జాలు, అక్రమాలకు అంతే లేకుండాపోయిందన్నారు. సర్వే నెంబరు 529లో ఎలాంటి అనుమతులు లేకుండా అర్ధరాత్రి ఇళ్లమధ్యలో ఉన్న గుట్టను బ్లాస్టింగ్ చేయడం భూమి కంపించి ఇళ్లు బీటలు వారుతున్నాయన్నారు. పక్కనే ఉన్న వెలుగు ప్రత్యేక వికలాంగుల క్షేత్రంలో మానసిక వికలాంగులు, వృద్ధులు భయభ్రాంతులకు గురవుతున్నట్లు చెప్పారు. ఈ విషయంగా కలెక్టర్, మదనపల్లె ఆర్డీవోలు స్పందించి అక్రమబ్లాస్టింగ్‌ను ఆపాలని లేనిపక్షంలో ప్రజలందరితో కలిసి పెద్దఎత్తున్న ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాలనీ, బృందావన్ కాలనీ, జగన్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ఓటు వరకే నీళ్ల నాటకం

- ముగిసిన సార్వత్రిక ఎన్నికలు
- పల్లెలకు ఆగిన నీటి సరఫరా
- అధికారులను అడగమంటున్న వైసీపీ నేతలు

ఎన్నికలు ముగియడంతో ఓటర్లతో ఇక పనేముందని వైసీపీ అభ్యర్థులు, నేతలు అనుకుంటున్నారు కాబోలు. ఇన్ని రోజులు వారి చుట్టూ తిరిగిన వారు ఇప్పుడు ముఖం చాటేస్తున్నారు. ఎన్నికలకు ముందు అధికారులపై ఒత్తిడి తెచ్చి ట్యాంకర్ల సంఖ్య పెంచి నీళ్లు సరఫరా చేయించారు. ఓట్ల కోసం ప్రజలపై ఎంతో ప్రేమ ఉన్నట్లు నీళ్ల నాటకం నడిపారు. తీరా పోలింగ్ ముగిశాక ఆ ఊసే పట్టించుకోవడం లేదు. పైగా తమకు ఓటు వేయలేదంటూ ట్యాంకర్లను నిలిపి వేయించారు. బిందెడు నీరు లేక జనం అల్లాడుతున్నా వారి మనసు కరగడం లేదు.





వానరాచపల్లె బిడికీలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు ఆర్థిక సహాయంతో తాగునీరు అందిస్తున్న దృశ్యం



జి.రెడ్డివారిపల్లెలో ప్రభుత్వ నిధులతో అందిస్తున్న తాగునీరు

సుండుపల్లె, మే 20: ఓట్ల కోసం నీళ్లనాటకం ఆడిన వైసీపీ నేతల అసలు స్వభావం ఇప్పుడు బట్టబయలైంది. పోలింగ్ ముగిసిందో లేదో.. పల్లెలకు వచ్చే తాగునీటి ట్యాంకర్లు బంద్ అయ్యాయి. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నడూ లేనంత ప్రేమ చూపిన నాయకులు, నేతలు ఇప్పుడు ఏమయ్యారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఐదేళ్లలో ఎన్నడూ లేని విధంగా కేవలం ఎన్నికల ముందు వైసీపీ నాయకులు చూపించిన ప్రేమ అంతా ఇంతా కాదు. వారి మాటలను నమ్మి మోసపోయామా అని మండల ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.

రోజుకు 15 లీటర్లే..

మండలంలోని జీ.రెడ్డివారిపల్లె, చిన్నగొల్లపల్లె, పోలిమేరపల్లె, మడితాడు గ్రామ పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి అధికంగా ఉందని అధికారులు చెబుతున్నారు. మూడు గ్రామాల్లో మాత్రం అధికారులు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం ఒక మనిషికి రోజుకు 15 లీటర్ల నీటిని అందిస్తున్నారు. ఒక మనిషికి రోజుకు 15 లీటర్ల నీరు ఏ విధంగా సరిపోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్నానం కోసం, తాగేందుకు ఇతర అవసరాల కోసం 15 లీటర్ల నీరు సరిపోదని కనీసం 60 లీటర్ల నీరు ఇవ్వాలని ప్రజలు వేడుకుంటున్నారు.

వాళ్లు చేతులెత్తేశారు.. వీళ్లు అందిస్తున్నారు

ఎన్నికల కోడ్ రావడానికి ముందు తమకు తాగునీటి సమస్య ఉందని ప్రజలు రాజకీయ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమయంలో మేమున్నాము.. మేము తాగునీటిని అందిస్తామని అధికార వైసీపీ నాయకులు, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రజలపై ఎనలేని ప్రేమ చూపించారు. పల్లెలకు ట్యాంకర్ల ద్వారా ఓట్ల కోసం తాగునీటిని అందించారు. అయితే పోలింగ్ ముగిసిన తరువాత వైసీపీ నాయకులు పల్లెల్లో తాగునీటి సరఫరా పేశారు. ఎన్నికలు అయిపోయాయి కదా అధికారులు తేలుతారులే అని చెతులెత్తేయడంతో ప్రజలు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే టీడీపీ నాయకులు మాత్రం పోలింగ్ ముగిసిన తర్వాత కూడా తాగునీటిని ట్యాంకర్లతో అందిస్తున్నారు. తాగునీటి సమస్య ఎన్ని రోజులు ఉంటే అన్ని రోజులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలనుకుంటున్నామని టీడీపీ నాయకులు చెబుతున్నారు.

కోడ్ వచ్చే ముందు నిధులు మంజూరు

ఎన్నికల కోడ్‌కు వారం రోజుల ముందు ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు మంజూరు చేశారు. తాగునీటి సమస్య ఉన్న ప్రతి గ్రామపంచాయతీలో పరిష్కరిస్తున్నామని అధికార వైసీపీ నాయకులు మండలమంతా ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి అధికార పార్టీకి చెందిన నాయకులను పిలిపించి ఎక్కడ తాగునీటి సమస్య ఉందో గుర్తించి బోర్లు వేస్తున్నామని జోరుగా ప్రచారం చేశారు. ఎన్నికల సమయం కదా.. బోర్లు వేస్తారులే అని ఆయా గ్రామాల ప్రజలు ఆశగా ఎదురుచూశారు. తీరా.. ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదని.. ఈ రోజు రేపు వేస్తామని ఎన్నికలు అయిపోయే వరకు మాటలు చెప్పారు. ఇప్పటివరకు అనుమతులు రాలేదు. తాగునీటి సమస్య పరిష్కారం కాలేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.10.6 లక్షలతో రాయవరం జంగంపల్లి, కొండల తూర్పు, సుండుపల్లె మండల కేంద్రంలోని మంగళపల్లి, మాన్యం వారిపల్లె, కోనంకివాండ్లపల్లె, దిగువనాయునివారి పల్లెలకు ప్రభుత్వ బోర్లు వేసేందుకు అధికారులు గుర్తించారు. ఎన్నికల కోడ్‌కు వారం రోజుల ముందు చెప్పడంతో అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఎన్నికల కోడ్ రావడంతో అనుమతులు రాలేదని అధికారులు చెబుతున్నారు. మరి తమకు తాగునీటి తిప్పలు తప్పవా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ముక్కోటి దేవతలారా రారండి!

- పెంచలకోనలో వైభవంగా ధ్వజారోహణం
- శేషవాహనంపై నృసింహుడి వైభోగం





విద్యుద్దీపకాంతుల్లో మెరిసిపోతున్న పెంచలకోన ఆలయం.. ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు (డక్కిలి), మే 20 : పెంచలకోన బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ సోమవారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా జరిగింది. గరుత్మంతుడి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేసి ఆలయంలో తిరుచ్చి క్షేత్రోత్సవం నిర్వహించారు. తెల్లటి గుడ్డపై పసుపు, గంధం, కుంకుమతో ప్రత్యేకంగా తయారు చేసిన గరుత్మంతుడి ప్రతిమను ధ్వజస్తంభంపై ఎగుర వేసి సకల దేవతులకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కోడిముద్ద ప్రసాదం కోసం మహిళా భక్తులు పోటీపడ్డారు. తిరుచ్చి ఉత్సవం, సహస్ర దీపాలంకారసేవ, ఊంజల్ సేవ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అలంకార మండపంలో ప్రత్యేక స్నపన తిరుమంజనాలు చేశారు. అనంతరం ఉభయ దేవేరులతో కలిసి శేషవాహనంపై కొలువుదీరిన స్వామి వారు కోనవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సాగర్ బాబు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 6 గంటలకు స్వామిఅమ్మవార్లకు పూలంగిసేవ, 8 గంటలకు హంసవాహన సేవ, 11.30 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు సహస్రదీపాలంకరణ, రాత్రి 10 గంటలకు బంగారు హనుమంత సేవ జరగనుంది.





సోమవారం రాత్రి శేషవాహనంపై ఊరేగుతున్న నృసింహస్వామి.. గరుత్మంతుడి చిత్రపటం, స్వామిఅమ్మవార్ల ఊరేగింపు

ఇంధనాన్ని పొదుపుగా వినియోగించాలి



మాట్లాడుతున్న ఆర్టీసీ కడప జోన్ ఈడీ వెంకటేశ్వరరావు

కడప (మారుతీనగర్) మే 20 : ఇంధనాన్ని పొదుపుగా వినియోగించగలిగితే సంస్థకు ఆదాయం చేకూర్చిన వారవుతారని ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు అన్నారు. అత్యల్ప ఇంధనపొదుపు, ప్రమాద రహిత శిక్షణ తరగతులను సోమవారం స్థానిక ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్టీసీ డ్రైవర్లకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జోన్‌లో విధులు నిర్వహించే ప్రతి డ్రైవర్ విధుల నిర్వహణలో మంచి లక్ష్యంతో పనిచేసినపుడే ప్రమాదాలు నివారించడంతో పాటు మంచి ఆదాయం తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో కడప ఆర్‌ఎం పి.గోపాల్‌రెడ్డి, రాయచోటి, బద్వేల్ డిపోల మేనేజర్లు, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

మహిమాన్వితం... దేవరరాయి

- 23న నల్లగంగమ్మ తల్లి జాతర





ప్రత్యేక అలంకరణలో నల్లగంగమ్మ తల్లి, మహిమాన్వితమైన దేవరరాయి

సంబేపల్లె, మే 20: సంబేపల్లె గ్రామంలో వెలిసిన శ్రీదేవరరాయి నల్లగంగమ్మ తల్లి భక్తుల పాలిట కల్పవల్లిగా విరాజిల్లుతోంది. 23వ తేదీ నల్లగంగమ్మ జాతర మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మునగా మురళీస్వామి, ఈవో కొండారెడ్డి తెలిపారు. ఆలయం ముందు భాగంలో బీజాక్షరాలతో వెలిసిన దేవరరాయి మహిమాన్విత రాయిగా నిలుస్తోంది. ఈనెల 23వ తేదీ మొలకల పౌర్ణమి సందర్భంగా వైభవంగా తిరుణాలను నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అమ్మవారి జాతరలో పాల్గొననున్నారు.

ఆలయ చరిత్ర

త్రేతాయుగంలో ఈ ప్రాంతం దట్టమైన అడవిగా ఉండేది. రైతులు పశువులను మేపుకునేవారు. అప్పట్లో కాలికి గాయమై కుంటుతూ నడుస్తున్న ఓ మేక ఓరోజు ఈ ప్రాంతంలోని ముళ్లపొదల్ని దాటగానే మామూలుగా నడిచింది. ఇది గమనించి ఆశ్చర్యపోయిన మేకల కాపరి ముళ్లపొదల్లో ఏదో మహాత్మ్యం ఉందన్న సంగతి గుర్తించి మిగతా పశువుల కాపర్లతో కలిసి ముళ్లపొదల్లో వెతకగా ఓ బండరాయి కనిపించింది. ఆ రాయిపై తెలియని భాషలో అక్షరాలు, ముగ్గులు ఉన్నాయి. దీనిని శక్తివంతమైనదిగా గ్రహించిన కాపరులు పూజలు చేయడం ప్రారంభించారు. ఇదే సమయంలో ఈ దారిన వెళుతున్న ఓ మహాముని పూజలు అందుకుంటున్న బీజాక్షరాలతో వెలిసిన ఈ రాయిని శక్తిదాయినిగా గుర్తించి ఎదురుగా నల్లగంగమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తూర్పున కదిరి దేవునికొండ, పడమరదుర్గం, ఉత్తరాన వెదుర్ల కొండ, దక్షిణాన ముగదాలకొండల మధ్యన వెలిసిన నల్లగంగమ్మ తల్లికి ఓ చిన్న ఆలయం నిర్మితమయ్యింది. కొన్నేళ్లపాటు ఈ గుడిలోనే పూజలందుకుంటూ వచ్చిన నల్లగంగమ్మ తల్లి దేవరరాయి నల్లగంగమ్మ తల్లిగా ప్రసిద్ధి చెందింది. ఈ క్రమంలో ఓ రోజున నల్లగంగమ్మ తల్లి రాయచోటికి చెందిన వ్యాపారి మునగా మురళీకి కలలో కనిపించి తన ఆలయాన్ని పునరుద్ధరించామని ఆజ్ఞాపించింది. అమ్మవారి ఆజ్ఞ ప్రకారం మునగా మురళీస్వామి తన శక్తి మేరకు ఆలయాన్ని అభివృద్ధి చేసి నిత్యం పూజలు జరిగేలా విశేష కృషి చేస్తున్నారు. ఎన్నో మహిమల్ని కనబరుస్తూ భక్తుల పాలిట వరప్రదాయినిగా వెలిసిన శ్రీనల్లగంగమ్మను పొరుగు జిల్లాలతో ఇతర రాష్ట్రాల భక్తులు సైతం నిత్యం దర్శించుకుంటుంటారు.

జాతర ఏర్పాట్లు ముమ్మరం

జాతర సందర్భంగా ఈనెల 23వ తేదీ గురువారం ఉదయం 5 గంటలకు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, 9 గంటలకు హోమాలు, మధ్యాహ్నం 12 నుంచి అన్నదానం, రాత్రి 8.30 గంటల నుంచి సప్తస్వరాల ఆర్కెస్ట్రా, డీజేడి డ్యాన్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, తెల్లవారుజామున చాందినీ బండ్ల మెరమణి తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆలయ నిర్మాణకర్త, ధర్మకర్తల మండలి చైర్మన్ మునగా మురళీస్వామి, కార్యనిర్వహణాధికారి కొండారెడ్డి, కమిటీ సభ్యులు గడికోట చంద్రశేఖర్‌రెడ్డి, దాతలు, పెద్దలు, భక్తులు, యువకుల సహకారంతో ఏర్పాట్లను ముమ్మరం చేశారు.

కుక్కలు బాబోయ్.. కుక్కలు

- సంతాన నిరోధక టీకాలు వేయడంలో అలసత్వం
- విపరీతంగా పెరిగిపోతున్న కుక్కల సంతతి
- రాత్రివేళ వీధుల్లోకి వెళ్లాలంటే వణికిపోతున్న జనం

రాజంపేట, మే 20 : రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. వన్యప్రాణుల సంరక్షణ సమితి న్యాయ స్థానాన్ని ఆశ్రయించి కుక్కలను చంపరాదని.. వాటి ఉత్పత్తిని తగ్గించడానికి సంతాన నిరోధక టీకాలను వేయించాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే అధికారులు ఈవిషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో కుక్కల సంతతి భారీగా పెరిగిపోయి ఏ వీధిలో అడుగు పెట్టాలన్నా భయపడే పరిస్థితి ఏర్పడింది. మామూ లుగా అయితే మున్సిపాలిటీస్థాయిలో మున్సిపల్ అధికారులు ప్రతి నెలా కుక్కలను తిరుపతికి తీసుకెళ్లి జంతు సంరక్షణశాఖ పరిధిలోని సంతాన నిరోదక టీకాలను వేయించి తిరిగి వాటిని ఆయా ప్రాంతా ల్లో వదలాలి. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విస్మరించడంతో రాజంపేట పట్టణంలో వందలాది కుక్కలు పెరిగిపోయాయి. వీటిని చంపడానికి వీలులేకపోవడంతో వీటి సంతతి పదింతలు పెరిగి మనుషులు అడుగుపెట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఇది ఎటువైపు దారి తీస్తుందోనని ఆయా ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కుక్కలు దాడి చేసి కరిస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రులకెళ్లి నయం చేసుకోవాలంటే కనీసం రూ.పదివేలు ఖర్చు పెట్టేకోవాల్సి వస్తోంది. ఒక్కోసారి ప్రాణాంతక మవుతున్నాయి. ఇక రైల్వేకోడూరు పట్టణంతో పాటు మండల కేంద్రాల్లో ఎక్కడ చూసినా వీటి బెడద ఎక్కువైంది. ఇక పల్లెల్లో చూస్తే వీటి గురించి చెప్పనవసరం లేదు. ఆయా మున్సిపల్ అధి కారులు, పంచాయతీ సిబ్బంది ప్రత్యేక వాహనాలను, సిబ్బందిని ఏర్పాటుచేసి ఎక్కడికక్కడే వ్యాధి నిరోధక టీకాలు వేయకపోతే కుక్కల బెడదను నియంత్రించడం కష్టమే.





వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు

గొడవలకు పాల్పడేలా రెచ్చగొడితే చర్యలు - సీఐ



నూలివీడులో వివిధ పార్టీ నాయకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్ఐలు

గాలివీడు, మే 20: సాధారణ ఎన్నికలు అనంతరం కౌంటింగ్ వరకు ప్రజలను గొడవలకు పాల్పడేలా రెచ్చగొడితే చర్యలు తప్పవని లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన గంగాధరబాబు రాజకీయ పార్టీల నాయకులను హెచ్చరించారు. ఆయన సోమవారం స్థానిక ఎస్ఐ వెంకట ప్రసాద్ కలిసి కొర్లకుంట, నూలివీడు పంచాయతీల్లోని అన్ని పార్టీల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల అనంతరం వివిధ పార్టీకు చెందిన కొంతమంది నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఎన్నికల్లో ప్రజలందరూ ప్రశాంతంగా ఓటు హక్కును వినియో గించుకున్నారని, అలాగే కౌంటింగ్ సమయంలో, కౌంటింగ్ ముగిసిన అనంతరం ప్రజలు, వివిధ పార్టీ కార్యకర్తలు సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. గొడవలకు పాల్పడితే వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాయకులు రెచ్చగొడితే చేడిపోయేది మీరేనని.. మీతో పాటు మీ కుటుంబాలు కూడా వీధిన పడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అంజిరెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

నేడు చిన్నగంగమ్మ జాతర



వీరబల్లి, మే20: మండల పరిధిలోని గుర్రప్పగారిపల్లె పంచాయతీలో మంగళవారం చిన్నగంగమ్మ జాతర వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మహేశ్వర్ రాజు తెలిపారు. జాతరకు సంబంధించి అన్ని సౌకర్యాలు కల్పించామని, భక్తుల కాలక్షేపం కోసం వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కాగా, జాతరకు మండల నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, మొక్కుబడులు ఉన్న వారు జంతుబలులు చాందినీ బండ్లు కట్టి మొక్కులను తీర్చుకుంటారు.

పశువుల అక్రమ రవాణా కట్టడికి నోడల్ అధికారి నియామకం

రాయచోటి టౌన్, మే 20: అన్నమయ్య జిల్లాలో పశువుల అక్రమ రవాణ కట్టడి కోసం దిశా డీఎస్పీ బాపూజీని నియమించారు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో పశువుల అక్రమ రవాణా జరుగుతోందంటూ ఓ వ్యక్తి హైకోర్టులో పిల్ దాఖలు చేయడంతో కోర్టు స్పందించింది. పశువుల అక్రమ రవాణాను కట్టడి చేయాలంటూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర పోలీసు యంత్రాంగం ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పవువుల అక్రమ రవాణా కట్టడి కోసం అధికారులను నియమించారు. ఈ మేరకు అన్నమయ్య జిల్లాలో దిశా డీఎస్పీ బాపూజీని జిల్లా నోడల్ అధికారిగా నియమించినట్లు జిల్లా ఎస్పీ కృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

వేసవి శిక్షణా తరగతులు

చిన్నమండెం, మే 20: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు ఆంజనేయరెడ్డి తెలిపారు. గ్రంథాలయంలో దినపత్రికలు, పోటీ పరీక్షలకు సరిపడా పుస్తకాలు, కరెంట్ అఫైర్స్ విద్యార్థులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆటల పోటీలకు సంబంధించిన క్యారమ్ బోర్డు, చెస్ అందుబాటులో ఉన్నాయని, జూన్ 7 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నారాపురం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జమ్మలమడుగు, మే 20: జమ్మలమడుగులో సోమవారం నుంచి నారాపురం వేంకటేశ్వరస్వామి క్రోధినామ సంవత్సర వార్షిక బ్రహ్మోత్సవాలు అంకుర్పాణంతో ప్రారంభం అయ్యాయి. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో అంకురార్పణం పూజలు నిర్వహించారు. రాత్రి మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ తాతిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, తాతిరెడ్డి తులసి దంపతులు పూజలో పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల కృషి మరువలేనిది : సుగవాసి

సుండుపల్లె, మే 20: నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం కష్టపడిన టీడీపీ కార్యకర్తల కృషి మరువలేనిదని రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. సోమవారం సుండుపల్లెలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. నియో జకవర్గ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం ప్రతి ఒక కార్యకర్తను కలుస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజలు అనేక కష్టాలతో ఉన్నారు. ప్రతి ఒక్కరినీ ఆదుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు, పింఛా డ్యాం తెగిపోయి రైతులు అనేక కష్టాలు అనుభవిస్తున్నారని.. వారికి అండగా ఉంటా నని హామీ ఇచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్ నాయుడు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంమోహన్ పాల్గొన్నారు.

సిద్దవటం : చేనేతలకు అండగా వుంటానని రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి సుబ్రమణ్యం అన్నారు. సోమవారం మాధవరం గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలోని చేనేతలకు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేరు స్తానన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామ పంచాయితీలో సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తామన్నారు. టీడీపీ కార్యనిర్వహణ కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, జిల్లా మాజీ తెలుగు యువత ఉపాధ్యక్షుడు కుప్పాల వెంకటసుబ్బయ్య, పార్లమెంటు ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : మండలంలోని భువనగిరిపల్లె లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు టీడీపీ అభ్యర్థి సుగవాసి సుబ్రమణ్యంను ఆహ్వానించారు. ఈనెల 21నుంచి 25వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ ఆహ్వానపత్రాన్ని అందజేశారు. మాజీ సర్పంచు లక్ష్మీనరసయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నందలూరు : టీడీపీ కార్యకర్తలకు అండగా వుంటామని రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి సుబ్రమణ్యం అన్నారు. సోమవారం టీడీపీ పార్లమెంటు ముస్లిం మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా కుటుంబాన్ని సుబ్రమణ్యం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి విజయం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎద్దుల విజయసాగర్, మండల టీడీపీ నాయకులు జంగంశెట్టి సుబ్బయ్య, సయ్యద్ అమీర్, మెహర్‌ఖాన్, మౌల, బూశెట్టి వెంకట సుబ్బయ్య, మోడపోతుల రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

ఒంటిమిట్ట : టీడీపీ కార్యకర్తలకు రుణపడి వుంటానని సుగవాసి సుబ్రమణ్యం అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ నాయకులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త అభ్యర్థి అయినా నన్ను ఆదరించారని.. మీకు జీవితాంతం రుణపడివుంటానని అన్నారు. ఎన్నికల్లో టీడీపీకి లభించిన ఆదరణపై స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై సన్నాహక సమావేశం

రాయచోటిటౌన్, మే 20: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ అధ్యక్షతన సంబంధిత అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కృష్ణయ్య మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఇందుకోసం 33 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, విద్యార్థుల కోసం వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. పరీక్షల నిర్వహణకు ఎటువంటి ఆటంకం లేకుండా విద్యుత్‌శాఖ అధికారులు కరెంటు సరఫరా చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్స్ ప్రకాశ్, అమరేంద్రకుమార్, నాగసురేశ్, హెల్త్, పోస్టల్, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్, లేబర్, ఆర్టీసీ, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో కృష్ణయ్య

అల్ట్రా సౌండ్ స్కానింగ్‌మిషన్ పరిశీలన

నందలూరు, మే 20: అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికార్యాలయం నుంచి జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ దేవశిరోమణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సరఫరా చేసిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌ను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ త్వరలోనే ప్రారంభించి రోగులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రతినెల 9,10వ తేదీలలో నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. స్కానింగ్ తరువాత లింగ నిర్ధారణ చేయకూడదన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి కార్తీక్ విశ్వనాథ్, సీహెచ్ఓ వెంకట నారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఉషారాణి, పీహెచ్ఎన్ శైలజ, సూపర్‌వైజర్లు నాగమల్లయ్య, సునీల్, ఎంఎల్‌హెచ్‌ఈ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



అల్ట్రాసౌండ్ స్కానింగ్‌ను పరిశీలిస్తున్న దేవశిరోమణి

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలు

చిట్వేలి, మే20 : సినీ హీరో జూనియర్ ఎన్‌టీఆర్ పుట్టినరోజు వేడుకలను సోమవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ ఎన్‌టీఆర్ అభిమానులు స్థానిక వీరభద్ర స్వామి ఆలయంలో రెడ్‌క్రాస్ అధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50 మంది రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం ఆలయం దగ్గర, దత్తగిరి నారా యణ ఆశ్రమంలో మానవతా చిట్వేలిశాఖ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే చెర్లోపల్లెలో ఆశ్రమానికి నిత్యావసర సరుకులతో పాటు బస్తా బియ్యాన్ని నిర్వాహకులకు అందించారు. జూనియర్ ఎన్‌టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు సాయిరాం, కార్యదర్శి మునిరావు, సామాజిక సేవా సభ్యులు, జూనియర్ ఎన్‌టీఆర్ అభిమానులు, ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో..: ప్రముఖ సినీ హీరో జూనియర్ ఎన్‌టీఆర్ జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని లావ సినిమా థియేటర్ ఎదురుగా ప్రధాన దారిలో ఎన్‌టీఆర్ అభిమాని ప్రసాద్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న ఎన్‌టీఆర్ అభిమానులు

దళితుల భూములను పరిశీలించిన ప్రజా సంఘాలు

సిద్దవటం, మే 20: మండలంలోని కడపాయపల్లి దళితులకు సంబంధించిన భూము లను అగ్రవర్ణాలవారికి అప్పగించేందుకు సిద్దవటం రెవెన్యూ అధికారులు అత్యుత్సాహం చూపిస్తున్నారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు వెంకటశివ మండిపడ్డారు. సిద్దవటం మండలం లింగంపల్లె పొలంలోని సర్వే నెంబర్లు 126,127,141-2లోని 16.11 ఎకరాలను సోమవారం లబ్ధిదారులతో కలిసి సీపీఐ దళిత వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం, ఏఐవైఎఫ్ నాయకులు దళిత భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా కొంతమంది దళిత రైతులు తమ భూములు తమకు అప్పగించకుంటే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. అనంతరం వెంకటశివ మాట్లాడుతూ 16.11 ఎకరాల భూమిని కడపాయపల్లె దళితులు 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారని.. వారి వారసులు ఈ భూమిని సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ భూములకు ధరలు రావడంతో అగ్రవర్ణాలు కన్నువేశారన్నారు. నిరుపేద దళితుల భూములను రక్షించాల్సిన మండల రెవెన్యూ అధికారులు, పోలీసుల కబ్జాదారులకు వత్తాసు పలుకు తున్నారని ఆరోపించారు.

కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బ్రహ్మం, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు భాగ్యలక్ష్మి, ఏఐవైఎఫ్ నాయకులు నాగార్జున, సీపీఐ నాయకులు ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి

రాయచోటిటౌన్, మే20: ఏపీ కమ్యూనిటీ నేచురల్ పార్మింగ్ ఎంపాయీస్ (ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు)కు పెండింగ్‌లో ఉన్న 16 నెలల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం అయన స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయశాఖలోని ఏపీ కమ్యూనిటీ నాచురిల్‌ఫార్మింగ్ విభాగంలో ఐసీఆర్ పీఎల్ 1, ఎల్2, మాస్టర్ ట్రైనర్లుగా పనిచేస్తున్న ఉద్యోగులతో ప్రభుత్వాలు అతి తక్కువ వేతనాలతో పని చేయించుకోవడమే గాక గత 16 నెలలుగా చేసిన పనికి వేతనం ఇవ్వకపోడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనేక రకాలుగా బటన్‌లు నొక్కి అన్ని రంగాల వారికి డబ్బులు విడుదల చేస్తున్న ప్రభుత్వం వీరికి జీతం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికే అప్పుల బారిన పడిన వీరికి వెంటనే పెడింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏవీ రమణ, కార్యదర్శి భాగ్యలక్ష్మి, కమిటీ సభ్యుడు ఫయాజ్ పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..

రైల్వేకోడూరు, మే 20: పట్టణంలో చినుకు పడిందంటే వీధులన్నీ చిత్తడి అవుతున్నాయి. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ఆదివారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. దీంతో పోలీసు స్టేషన్ వెనుకభాగం, ధర్మాపురం, రంగ నాయకుల పేట, జగడంపల్లె తదితర వీధిరోడ్లు జలమయం అయ్యాయి. మండలంలోని కె.బుడు గుంటపల్లె, అయ్య వారిపల్లె, తాడి వారిపల్లె, వీపీఆర్ కండ్రిక, దేశెట్టిపల్లె, లక్ష్మీపురం, లక్ష్మీగార్డెన్స్, సమతానగర్, కన్నెగుంట ఎస్టీ కాలనీ తదితర 20 గ్రామాలకు వెళ్లే రోడ్డు దెబ్బతినడంతో చిన్నపాటి వర్షానికే బురదమయం అయింది. అటు వెళ్లే వాహనాలు, పాదాచారులు ఇబ్బందులు పడుతు న్నారు. రైల్వేకోడూరు పట్టణంలోని పలు రోడ్లకు డ్రైనేజీ లేకపోవ డంతో వీధుల్లో నీళ్లు నిలిచి ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు.



కోడూరు పట్టణంలో చిన్నపాటి వర్షానికి జలమయమైన రోడ్డు

రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించండి

రైల్వేకోడూరు, మే 20: కోడూరు పట్టణంలో పెండింగ్‌లో వున్న వీధిరోడ్లతో పాటు డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని రైల్వేకోడూరు సీపీఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం ఇచ్చారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, బీకేఎసంయూ జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, కోడూరు నియోజకవర్గ కార్యదర్శి రేవూరి శంకరయ్యలు మాట్లాడుతూ కోడూరు పట్టణంలో ప్రతివీధి, రోడ్లలో చెత్తాచెదారం పేరు కుపోయిందన్నారు. అలాగే వర్షపునీరు నిలబడుతుందన్నారు. తక్షణమే చెత్తకుప్పలు ఎత్తి వేయాలన్నారు. బ్లీచింగ్ చల్లాలన్నారు. జూన్ 15 లోగా పెండింగ్‌లో వున్న వీధిరోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మంచాలని డిమాండు చేశారు.




కార్యదర్శికి వినతిప్రతం ఇస్తున్న సీపీఐ నాయకులు

మందుబాబుల అడ్డా.. రైల్వేస్టేషన్

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని రైల్వే అధికారులు

రాజంపేట, మే 20: రాజంపేట రైల్వేస్టేషన్ మందుబాబులకు అడ్డాగా మారింది. రాత్రి సమయమైతే చాలు రైల్వేస్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో మందుబాబులు పీకలదాకా తాగి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రైల్వేస్టే షన్‌ను ఆనుకొని ఏకంగా మూడు మద్యం షాపులు అటూ ఇటూ ఉండటంతో రైల్వేస్టేషన్ ప్రాంతాన్ని ఆసరాగా చేసుకొని తాగుబోతులు చిందులేస్తున్నారు. రైల్వేస్టేషన్‌లో ప్రాంగణంలో రాత్రివేళల్లో సరైన లైటింగ్ సౌకర్యం కూడా లేదు. ట్రైన్ వచ్చే సమయంలో లైట్లు వేయడం జరుగుతోంది. మహిళా ప్రయాణీకులైతే పడే బాధలు వర్ణనాతీతం. రైల్వేస్టేషన్ ఆనుకొని పడమటి వైపు రెండు బ్రాందీషాపులు, కుడివైపున సమీపంలో మరో బ్రాంది షాపు ఉండటం వల్ల రైల్వే ఓవర్‌బ్రిడ్జి కింద స్టేషన్ ఆనుకొని పీకల దాకా తాగి మందుబాబులు చిందులేస్తున్నారు. ఒంటరిగా మహిళలు రావాలంటే భయపడిపోతున్నారు. ఇక యాచకులు సాయంత్రం అయితే పీకల దాక తాగి ప్లాట్‌ఫాంలపై నిద్రిస్తున్నారు. రాత్రివేళ దూరప్రాంతాలకు రాజంపేట రైల్వేస్టేషన్ నుంచి అనేక రైళ్లు వెళతుంటాయి. అటు ఎక్కేవారు.. ఇటు దిగేవారు ఎక్కువగా ఉంటారు. అయితే ఎక్కడ చూసినా ఈ మద్యం తాగి పడుకొని ఉన్నవారితో ఇబ్బందిపడాల్సి వస్తోంది. గతంలో దీనిపై ఎన్నో ఫిర్యాదులు అందినా పట్టించుకునేవారు లేరు. రైల్వే అధికారులు పట్టించుకోకపోవడం, రాత్రి వేళనక్రమంగా పోలీసుగస్తీ లేకపోవడం ఇత్యాదికారణాల వల్ల రైల్వేస్టేషన్ అటూఇటూ ప్లాట్‌ఫాం కింద, గోడల కింద, రైల్వేస్టేషన్ అటూ ఇటూ మందుబాబులు విచ్చలవిడిగా తాగుతూ ప్లాట్‌ఫాంపైనే చిందులేస్తూ ఉంటారు. దీనిపై గట్టి నిఘా పెట్టి మందుబాబులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.



పీకలదాకా తాగి ప్లాట్‌ఫాంపై పడిపోయిన తాగుబోతు



మందుబాబులు ప్లాట్‌ఫాంపైనే తాగి అక్కడే పడేసిన మందుబాటిళ్లు

ప్రమాదంలో కాలు కోల్పోయా..

వైద్య చికిత్సకు సాయంచేసి ఆదుకోండి ● దాతలకు బాధితుడు గణేశ్ విజ్ఞప్తి


వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతున్న గణేశ్

పుంగనూరు, మే 20: రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన తనకు చికిత్స కోసం రూ.13లక్షలు ఖర్చవుతుందని బాధితుడు గణేశ్ తెలిపారు. ఈ మొత్తాన్ని భరించే స్థోమత లేని తనకు దాతలు సాయం చేసి ఆదుకోవాలని కోరారు. సోమల మండలానికి చెందిన ఈయన ప్రస్తుతం సీఎంసీలో చికిత్స పొందుతున్నారు. బాధితుడు తెలిపిన మేరకు.. వల్లిగట్ల పంచాయతీ కూకటివారిపల్లెకు చెందిన జి.సీతప్ప కుమారుడు జి.గణేశ్ ఎంఏ వరకు చదివి గ్రూప్స్, ఎస్ఐ తదితర ఉద్యోగాలకు తిరుపతిలో శిక్షణ పొందుతున్నారు. ఈనెల 10వతేది తన స్నేహితుడితో కలిసి తిరుపతి నుంచి మోటారు సైకిల్‌పై వస్తుండగా పాకాల మండలం దామలచెరువు వద్ద ఎదురుగా వస్తున్న వస్తున్న వాహనం వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో గణేశ్ కుడికాలు పూర్తిగా తెగిపోయింది. అతడి స్నేహితుడూ గాయపడ్డారు. క్షతగాత్రులే 108కు ఫోన్ చేయగా వాహనాలు అందుబాటులో లేవని సమాధానం వచ్చింది. వీరిద్దరిని గమనించిన కొందరు తమిళనాడు రాష్ట్రం వేలూరు సీఎంసీ వైద్యశాలకు హుటాహుటిన తీసుకెళ్లారు. తెగిపోయిన కాలు అమర్చడం వీలుకాదని, ప్రమాదానికి గురైన కాలు ఇన్ఫెక్షన్ వల్ల మరికొంత తీసేయాలని వైద్యులు చెబుతున్నారు. అలాగే శరీరంలో కొన్ని ఎముకలు విరిగాయని వైద్యచికిత్సల కోసం రూ.13 లక్షలు అవసరం అవుతుందని చెప్పారు. పేదకుటుంబం, వృద్ధులైన తల్లిదండ్రులు అంత మొత్తం భరించే పరిస్థితి లేకుండా పోయింది. అప్పటికీ బిడ్డను కాపాడుకోవడానికి అప్పులు చేసిన తెచ్చిన డబ్బు ఏమాత్రం సరిపోవడంలేదు. ఎవరైనా దాతలు స్పందించి ఆదుకొని వైద్యచికిత్సలకు సహాయపడాలిన గణేశ్ కోరారు. తన పీలేరు స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతానెంబరు 41339163182, ఐఎఫ్ఎస్సీ నెంబరు ఎస్బీఐఎన్0016428, ఫోన్‌పే నెంబర్లు 8374557403, 6304496763కు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరారు.

14 రీచుల్లో గడువు ముగిసింది

ఇసుక తవ్వి తరలిస్తే చర్యలు తప్పవంటూ జేసీ హెచ్చరిక


నగరి మండలం ఓజీకుప్పం ఇసుక రీచ్ వద్ద రైతులతో మాట్లాడుతున్న జేసీ

చిత్తూరు రూరల్, మే 20: జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన 14 ఇసుక రీచుల్లో మైనింగ్‌కు గడువు ముగిసిందని, జేసీ శ్రీనివాసులు తెలిపారు. ఇకపై వాగులు, వంకలు, నదుల్లో మైనింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చిత్తూరు రూరల్ మండలం అనంతాపురం, బీఎన్ఆర్ పేట, ముత్తుకూరు, ఆనగల్లు ఇసుక రీచ్‌లను సోమవారం ఆయన పరిశీలించారు. కొన్ని రోజులుగా ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతూ ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని ఫిర్యాదులు అందాయన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు వివిధ శాఖల అధికారులతో కలిసి ఇసుక రీచులను పరిశబూలించామన్నారు. కొత్త పాలసీ వచ్చేవరకు ఎవరైనా అక్రమంగా మైనింగ్ చేస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఎస్ఈబీ ఏఎస్పీ సుబ్బరాజు, గనుల శాఖ డీడీ ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ మదన్ మోహన్, డీపీవో లక్ష్మి, చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు మండలంలోని నందనూరు, కొట్రకోన, ముక్కళత్తూరు గ్రామాల వద్ద గల ఇసుక రీచ్‌లను సోమవారం అధికారులతో కలిసి జేసీ తనిఖీ చేశారు. ప్రస్తుతం రీచ్‌ల నుంచి ఇసుక రవాణా పూర్తిగా నిలిచిపోయినట్లు జేసీ పేర్కొన్నారు. జిల్లా అధికారులతో పాటు స్థానిక తహసీల్దార్ రవి, డీటీ తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డుకుంటే మాపై కేసులు పెట్టారు

జేసీకి ఓజీకుప్పం వాసుల ఫిర్యాదు

నగరి, మే 20: నగరి మండలం ఓజీకుప్పంలో ఇసుక రీచ్‌ను సోమవారం సాయంత్రం అధికారులతో కలిసి పరిశీలించిన జేసీ శ్రీనివాసులు స్థానిక రైతులతో మాట్లాడారు. ఇసుకను రాత్రి వేళల్లో ఇష్టానుసారం తరలించడంతో భూగర్భజలాలు అడుగంటి.. పంటలకు సాగునీరు అందని పరిస్థితి తలెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇకసు అక్రమ రవాణాను అడ్డుకున్నందుకు తమ గ్రామస్తులపై కేసులు పెట్టారని వారు జేసీ దృష్టికి తీసుకొచ్చారు.అధికారపార్టీ అండదండలతో రాత్రి వేళల్లో తమిళనాడుకు ఇసుక అక్రమరవాణా చేపట్టారని ప్రశ్నిస్తే తమను బెదిరించేవారన్నారు. ఇసుక తరలిస్తే అధికారుల దృష్టికి తీసుకు రావాలని జేసీ కోరారు. రీచ్ గడువు ముగియడంతో ఇసుక తరలించరాదని హెచ్చరిక బోర్డులు పెట్టాలని, గ్రామాలలో దండోరా వేయించాలని తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి ఆయన సూచించారు.

సిట్ దర్యాప్తులో వెలుగులోకి కీలక విషయాలు

చంద్రగిరి పోలీసుల వైఖరిపై సిట్ నివేదిక

తిరుపతి(నేరవిభాగం), మే 20 : తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఎన్నికల పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన హింసాత్మక ఘటనలకు పోలీసుల వైఫల్యమే ప్రధాన కారణంగా సిట్ అధికారులు గుర్తించారు. అలాగే సిట్ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా పద్మావతి వర్సిటీ వద్ద నానీపై వైసీపీ శ్రేణులు మారణాయుధాలతో హత్యాయత్నానికి ప్రయత్నించినా సీరియస్‌గా పరిగణించకుండా కేవలం హత్యాయత్నం జరిగిందని 307 సెక్షన్ కింద కేసు నమోదు చేయడం సిట్ గుర్తించింది.సీఐ రామచంద్రారెడ్డి వాహనాన్ని ధ్వంసం చేసిన కేసులో 21మందిని నిందితులుగా గుర్తించి 41ఏ కింద నోటీసులు జారీ చేశారు.కూచువారిపల్లిలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య జరిగిన దాడులు, ప్రతి దాడులకు సంబంధించి రామిరెడ్డిపల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర రెడ్డి, మోహిత్ రెడ్డి గన్‌మ్యాన్ ఈశ్వర్‌రెడ్డి, పీఆర్వో బండి వేణుగోపాల రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మూడు కేసుల్లో దాదాపు 64మందిని నిందితులుగా గుర్తించారు. వీరిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లలో వుంచిన సెక్షన్లు సీరియస్‌గా వున్నా భారీసంఖ్యలో వైసీపీ శ్రేణులు విచక్షణారహితంగా కర్రలు, రాడ్లు, రాళ్ళతో టీడీపీ నాయకులు, గ్రామస్తులపై దాడి చేసి గాయపరచిన ఘటనకు సంబంధించి మాత్రం కేవలం ముగ్గురు నిందుతులను మాత్రమే నమోదు చేయడం పోలీసుల పక్షపాతానికి నిదర్శనమన్న విమర్శలున్నాయి. ఈ నాలుగు కేసుల్లో ఇప్పటివరకూ చంద్రగిరి పోలీసులు ఏ ఒక్క నిందితుడినీ అరెస్టు చేయక పోవడాన్ని సిట్ తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. దీనిపై సోమవారం చంద్రగిరి డీఎస్పీపై జిల్లాస్థాయి ఉన్నతాధికారి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. అలాగే బ్రాహ్మణకాలువలో పోలింగ్ రోజు వైసీపీ, టీడీపీ ఏజెంట్ల మధ్య జరిగిన గొడవల్లో దాదాపు 10 మంది గాయపడినట్లు సమాచారం. ఇరువర్గాలను చెదరగొట్టడానికి సీఆర్‌పీఎఫ్ సిబ్బంది నాలుగు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అయితే ఇక్కడ కూడా నిందితులను అరెస్టు చేయలేదని సిట్ సభ్యులు డీఎస్పీ రవిమనోహరాచారి, సీఐ ప్రభాకర్ గుర్తించడంతో పాటు ఎఫ్ఐఆర్‌లలో కొత్త సెక్షన్లు చేర్చే విషయమై ఉన్నతాధికారులకు సిపార్సు చేశారు.కూచువారిపల్లి, రామిరెడ్డిపల్లి, బ్రాహ్మణకాలువ గ్రామాలను సమస్యాత్మకంగా గుర్తించినా అవసరమైనన్ని బలగాలను నియమించడంలోనూ,ఘటనలను నివారించడంలోనూ పోలీసుల వైఫల్యాన్ని సిట్ నివేదికలో పొందుపరిచినట్లు తెలిసింది.ఈ నేపథ్యంలో కొంతమంది అధికారులపై వేటు పడే అవకాశం వుందని తెలిసింది.


రామిరెడ్డిపల్లెలో సిట్ అధికారుల విచారణ

పోలీసు వైఫల్యమే!

ఎన్నికల కేసుల్లో నిందితుల అరెస్టుకు డీజీపీ ఆదేశం

జిల్లాలో సుమారు వంద మందిపై నమోదైన కేసులు

నానీపై దాడి కేసులో 13 మంది మాత్రమే అరెస్టు

మిగిలిన కేసుల్లో నిందితుల అరెస్టుకు ఐదు బృందాల ఏర్పాటు

సిట్ అధికారుల నివేదిక పర్యవసానం

తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణలకు సంబంధించిన కేసుల్లో నిందితులను తక్షణం అరెస్టు చేయాలని డీజీపీ హరీష్ గుప్తా ఆదేశించారు. ఈనెల 13న పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన ఘర్షణలకు సంబంధించి నమోదైన కేసుల్లో ఇప్పటి వరకూ 13మందిని మాత్రమే అరెస్టు చేశారు. మిగిలిన కేసుల్లో నిందితులను అరెస్టు చేయలేదని సిట్ అధికారులు తమ నివేదికలో ప్రస్తావించారు. దీంతో ఇప్పటివరకూ అరెస్టు కాని నిందితులను 24 గంటల్లో అరెస్టు చేయాలని డీజీపీ జిల్లా ఎస్పీని ఆదేశించారు. ఆ మేరకు జిల్లా ఎస్పీ నిందితుల అరెస్టు కోసం ప్రత్యేకంగా ఐదు బృందాలను ఏర్పాటు చేశారు.

ఎన్నికల పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన పలు ఘర్షణలకు సంబంధించి జిల్లాలో వంద కంటే ఎక్కువ మందిపై కేసులు నమోదైన సంగతి తెలిసిందే. రామచంద్రాపురం మండలం బ్రాహ్మణ కాలవ గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో జరిగిన ఘర్షణపై పోలింగ్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. అలాగే అదే రోజు రాత్రి చంద్రగిరి మండలం కూచివారిపల్లిలో జరిగిన ఘర్షణలకు సంబంధించి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి ఫిర్యాదుతో 24 మందిపై కేసు నమోదైంది. ఆ ఘర్షణలకు సంబంధించే వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గన్‌మ్యాన్ ఈశ్వర్‌రెడ్డి చేసిన ఫిర్యాదుతో 20 మందిపై కేసు నమోదైంది. ఇదే 20 మందిపై మోహిత్ రెడ్డి పీఆర్వో బండి వేణుగోపాల్‌రెడ్డి చేసిన ఫిర్యాదుపైనా పోలీసులు కేసు నమోదు చేశారు.కూచువారిపల్లి మాజీ సర్పంచ్ కవిత, గ్రామస్తురాలు వనజ చేసిన ఫిర్యాదులతో ముగ్గురు వ్యక్తులను పేర్కొంటూ మరికొందరిపై అంటూ కేసు నమోదు చేశారు. ఈ కేసులోనూ నిందితుల సంఖ్య 20 మంది దాకా వుండే అవకాశముంది. 14వ తేదీ తిరుపతిలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం జరగగా ఆ కేసులోనూ పలువురిపై కేసు నమోదైంది. అక్కడే పోలీసు వాహనం వజ్రపై, అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి వాహనంపై జరిగిన దాడులకు సంబంధించి పదిమందిపై కేసు నమోదైంది. ఎమ్మార్‌పల్లి సీఐపై దాడి కేసులో ఎనిమిదిమందిని నిందితులుగా గుర్తించారు. ఇలా మొత్తం ఎనిమిది కేసుల్లో వంద మందికి పైనే నిందితులుగా కేసుల్లో నమోదయ్యారు. ఇందులో ఇప్పటి వరకూ కేవలం నానీపై హత్యాయత్నం కేసులో 13 మందిని మాత్రమే పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన ఏడు కేసుల్లో ఒక్కరినీ అరెస్టు చూపలేదు. ఆదివారం ఈ కేసులపై దృష్టి సారించిన సిట్ అధికారులు అరెస్టులు జరగని విషయాన్ని తమ నివేదికలో ప్రస్తావించారు. దీంతో అప్రమత్తమైన డీజీపీ 24 గంటల్లో మిగిలిన కేసుల్లో నిందితులను అరెస్టు చేయాలని తిరుపతి ఎస్పీని ఆదేశించారు.దీంతో నిందితుల అరెస్టు కోసం ఐదు ప్రత్యేక బృందాలను ఎస్పీ రంగంలోకి దించారు. కాగా పులివర్తి నానీపై హత్యాయత్నం సందర్భంగా ఆయన గన్‌మ్యాన్ ధరణి జరిపిన కాల్పుల్లో గాయపడి చెన్నైలో చికిత్స తీసుకున్న నిందితుడొకరు డిశ్చార్జి అయినట్టు తెలిసింది. అతడిని అరెస్టు చేయడానికి అధికారులు చెన్నై వెళ్ళినట్టు సమాచారం. మరోవైపు ఎన్నికల ఘర్షణలకు సంబంధించిన నమోదైన కేసుల్లో అదనపు సెక్షన్లను చేర్చాల్సిన అవసరముందని సిట్ అధికారులు తమ నివేదికలో సిఫారసు చేసినట్టు తెలిసింది.

12 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, మే 20: గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 12 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. నింద్రలో 21.2మి.మీ., సోమల 16.6, విజయపురం 15.2, నగరి 12.8, శాంతిపురం 12.2, సదుం 11.2, పెద్దపంజాణి 9.4, వీకోట, పాలసముద్రం 5.2, చౌడేపల్లె 4.6, కార్వేటినగరం 1.8, బైరెడ్డిపల్లెలో 0.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

23లోగా జీతాల బిల్లులు అందించాలి

ఖజానా శాఖ డీడీ రామచంద్ర

చిత్తూరు కలెక్టరేట్, మే 20: జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి మేనెల జీతాల బిల్లులు ఈనెల 25కు బదులు 23వ తేదీలోగా సమీప సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో అందించాలని ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్ర ఆదేశించారు. సోమవారం డ్రాయింగ్ డిస్‌బర్స్‌మెంట్ ఆఫీసర్లకు ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య


బాలాజీ (ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్, మే 20: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పుంగనూరులో చోటుచేసుకుంది. ఏఎస్ఐ నరసింహులు తెలిపిన ప్రకారం.. పుంగనూరు మోతీనగర్‌కు చెందిన బాలాజీ(23) కారు డ్రైవర్. కొంతకాలం క్రితం తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి నాగమణి చిరువ్యాపారం చేస్తోంది. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. వీరి ప్రేమను ఆమె తల్లిదండ్రులు అంగీకరించలేదని అతడికి తెలిసింది. ఆదివారం నాగమణి వ్యాపార నిమిత్తం బయటకు వెళ్లడంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. తల్లి రాత్రి ఇంటికి వచ్చి తలుపు తట్టినా.. గట్టిగా కేకలు వేసినా స్పందన లేదు. స్థానికుల సాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా లోపల ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిన కుమారుడిని చూసి ఆమె తల్లడిల్లిపోయారు. ఏఎస్ఐ నరసింహులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు రాష్ట్రాల్లో ఎల్లుండినుంచి గజ గణన

మంగళం, మే 20 : ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఏనుగుల గణనకు ముహూర్తం నిర్ణయించారు.ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఈ మూడు రాష్ట్రాల్లో మూడు రోజుల పాటు గజ గణన చేపట్టనున్నారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక సరిహద్దులు కుప్పం దగ్గర కలిసి ఉండడంతో మూడు రాష్ట్రాల గజ గణన ఒకేసారి చేపడితే ఖచ్చితమైన సంఖ్య వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ మధ్యకాలంలో ఏనుగులు దాడి చేసి పంట నష్టం, ప్రాణనష్టం కలిగిస్తున్నాయి. గజ గణన చేపడితే ఏ ప్రాంతంలో ఎక్కువ ఏనుగులు ఉన్నాయో తెలుసుకుని వాటికి ఆహారం, తాగునీటి సౌకర్యం కల్పించగలిగితే ఊర్లమీదకు వచ్చే అవకాశం వుండదని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు.శేషాచల అటవీప్రాంతంలో జరిగే గజ గణనలో 30మంది ఎఫ్ఎస్‌వో, ఏబీవో, ఎఫ్‌బీవో సిబ్బందితో చిత్తూరు డీఎఫ్‌వో పర్యవేక్షణలో ఎఫ్ఆర్వోలు పాల్గొంటారు. మొదటిరోజు జిగ్జాగ్ పద్ధతిలో అన్ని బీట్లను జల్లెడ పడతారు. రెండవ రోజు ట్రాన్సక్టు లైన్స్‌లో ఏనుగులను గుర్తించడం జరుగుతుంది. మూడవ రోజు అటవీప్రాంతంలో మంచినీటి కుంటలు, చెరువులు ఉండే ప్రాంతాల్లో తనిఖీలుచేస్తారు. ఇలాఒకేసారి మూడు రాష్ట్రాల్లో చేయడం వల్ల ఖచ్చితమైన ఏనుగులసంఖ్య వచ్చేఅవకాశం ఉందని భావిస్తున్నారు.గత సంవత్సరం శేషాచల అడవుల్లో వంద నుంచి 120వరకు గజరాజులున్నట్లు అటవీశాఖగణనలో తేలింది. చిత్తూరు అటవీప్రాంతంలో 60 నుంచి 70 వరకు, పార్వతీపురంలో 20, తిరుపతి సమీప అటవీప్రాంతంలో 30 ఉన్నట్లు గణనలో తేలింది. అయితే ఈ సంవత్సరం పెరిగాయా.. తగ్గాయా అన్న విషయమై గణన చేపట్టిన నెల రోజులకు స్పష్టత వచ్చే అవకాశముంది.

అంజప్ప.. హనుమ భక్తి

● కుటుంబ పోషణకు రామనామ సంకీర్తనలతో ఇంటింటికి
● వచ్చిన డబ్బు పొదుపుచేసి ఆంజనేయుడి గుడి నిర్మాణం
● సన్మానించిన స్థానికులు


గొంగడి అంజప్ప దంపతులను సన్మానిస్తున్న స్థానికులు

పలమనేరు, మే 20: ప్రతి రోజూ ఏదో ఒక వీధిలో రామ నామ సంకీర్తనలు పాడుకుంటూ వెళ్తుంటారాయన. ఇలా ఐదు దశాబ్దాలుగా పలమనేరులో యాచన చేస్తున్న గొంగడి అంజప్ప దంపతులను సోమవారం స్థానికులు పూలమాల వేసి సన్మానించారు. ఎందుకిలా చేశారంటే... పట్టణ సమీపంలోని టీఎస్‌అగ్రహారం వద్ద ఉన్న కాలనీలో గొంగడి అంజప్ప నివాసం ఉంటున్నారు. తన తుంబురతో పురవీధుల్లో రామనామ సంకీర్తనలు పాడుతూ గృహస్థులు ఇచ్చే చిన్నపాటి సొమ్ము తీసుకునే వారు. తన భార్యను పోషించుకొంటూ తన స్థోమతకు మించి కాలనీలోనే తన ఆరాధ్యదైవం రాముడి భక్తుడైన అభయాంజనేయస్వామి గుడి నిర్మించారాయన. ఉదయం, సాయంత్రం అక్కడే కొంతసేపు సీతారామనామ జపంచేస్తూ స్వామివారికి దీప,ధూప నైవేద్యాలను సమర్పించుకొని, పగలంతా పట్టణంలో రామనామ కీర్తన చేసుకొంటూ యాచన చేసేవారు. అంజప్పకు వయోభారం పెరగడంతో గతంలోలాగా తరచూ కాకుండా, అప్పుడప్పుడు మాత్రమే వీధుల్లో తిరుగుతున్నారు. అతడి భక్తికి, రామనామ సంకీర్తనలకు పరవశమైన ఇక్కడి యోగాగురువు నంద గోపాల్, సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు, జిల్లా మేదరసంఘం మహిళాకార్యదర్శి మల్లిక బీసీ నాయకుడు పూలే గోవిందస్వామి కలిపి సోమవారం గొంగడిఅంజప్ప, గొంగడి గంగమ్మ దంపతులను సన్మానించారు.

తిరుపతి-కాట్పాడి మధ్య నాలుగు ప్యాసింజర్ రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), మే 20: తిరుపతి-కాట్పాడి స్టేషన్ల మధ్య రోజువారీగా నడుస్తున్న స్పెషల్ ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 27 నుంచి 30వ తేది వరకు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కోయంబత్తూరు-తిరుపతి, విల్లుపురం-తిరుపతి, బెంగళూరు-తిరుపతి మధ్య రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్‌లకు కూడా ఈ తేదీల్లో కాట్పాడి-తిరుపతిల మధ్య రాకపోకలు రద్దు చేసినట్లు తెలిపారు. తిరుపతిలో రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని, ప్రయాణికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.




టమోటా పంటను ధ్వంసం చేసేసిన ఏనుగులు - నేలరాలిపోయిన మామిడి కాయలు - విరిగిన కొబ్బరి చెట్ల కొమ్మలు

వణికిస్తున్న గజదాడులు

సదుం, మే 20: సదుం మండలంలోని అటవీ శివారు ప్రాంతాల్లోని పంట పొలాలపై ఏనుగుల వరుస దాడులు స్థానికుల్లో వణుకు పుట్టిస్తోంది. గతవారం శని, ఆదివారాల్లో జోగివారిపల్లె పంచాయతీలో పంటలపై పడి నష్టపరిచిన ఏనుగులు వరుసగా మూడో రోజైన సోమవారం మళ్లీ మొరవపల్లె పంచాయతీ గంటావారిపల్లె సమీపంలోని పంట పొలాల్లో సంచరించి స్థానిక రైతులు రాజేంద్ర టమోటా పంటను తొక్కి, సులోచన మామిడి తోటలో కొమ్మలు విరిచి, కాయలు నేలరాల్చాయి. సుబ్రహ్మణ్యం కొబ్బరి చెట్లను నష్టపరిచాయి. సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది జరిగిన పంట నష్టం, ఏనుగుల సంచరించి ప్రాంతాలను పరిశీలించారు. కల్లూరు-పుదిపట్ల మార్గంలోని పుల్లావానిచెరువు దగ్గర నుంచి అటవీ మార్గాన గంటావారిపల్లె సమీపానికి వచ్చి మళ్లీ అదే ప్రాంతానికి చేరి ఉంటాయని బీట్ ఆఫీసర్ మహేశ్ అన్నారు. ఏనుగులు మళ్లీ పంట పొలాల పైకి రాకుండా ట్రాక్టర్ సాయంతో మళ్లిస్తామని ఆయన తెలిపారు.

ఉపాధికేదీ అండ..!

- మండుటెండలో కూలీల పాట్లు
- తాగునీటికి నోచుకోని దయనీయ పరిస్థితి
- పనిచేసే ప్రదేశాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు కరువు
- వైసీపీ పాలనలో ఊసేలేని కనీస వసతులు

ములకలచెరువు, మే 20: భానుడు ఉగ్రరూపం దాల్చాడంతో ఎండలు మండిపోతున్నాయి. జనం ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. ఇంత ఎండలోనూ ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారు. ఎండలకు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉన్నా...పొట్టకూటి కోసం పనులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అలాంటి వారిపైన ప్రభుత్వం కనీస కనికరం చూపలేదు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో ఉపాధి కూలీలకు చుక్కలు కన్పించాయి. కూలీలు పనిచేసే చోట కనీస వసతులు సైతం కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. కనీస వసతులైన తాగునీటి వసతి గాలికి వదిలేసింది. పని మధ్యలో కాసేపు ఉపశమనం పొందడానికి ఏర్పాటు చేయాల్సిన టెంట్లు ఎక్కడా కన్పించడం లేదు. అత్యవసర సమయాల్లో, అస్వస్థతకు గురైనప్పుడు ప్రథమ చికిత్సలు చేసుకోవడానికి మెడికల్ కిట్లు లేవు. ఉపాధి కూలీలకు పనిచేసే చోట కల్పించాల్సిన కనీస వసతుల గురించి పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీలకు గ్రామాలకు దూరంగా ఉన్న కొండలు, గుట్టల ప్రాంతాల్లో పనులు కల్పిస్తుండడంతో దూరాభారమైనా పనులకు వెళ్లాల్సి వస్తోంది. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లో ప్రతి రోజూ సుమారు 22వేల మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. ఫారంపాండ్స్, ఫీడ్ కాలువలో పూడికతీత పనులు, క్యాటిల్ పాండ్స్, డగౌట్ పాండ్స్, రింగ్ ట్రెంచ్‌లు, కండిత కందకాలు, కొండల దిగువ ప్రాంతాల్లో నీటి నిల్వ కందకాలు తదితర పనులు చేస్తున్నారు. పనులు చేసే చోట కనీస వసతైన తాగునీటి సౌకర్యం కల్పించకపోవ డంతో ఉపాధి కూలీల గొంతు తడా రుతోంది. ఇళ్ల నుంచి బాటిళ్లలో తెచ్చుకుంటున్న నీరు చాలకపోవడంతో కూలీలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.



కూలీలకు గతంలో కల్పించిన వసతులు

ఉపాధి కూలీలకు ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు గతంలో టార్పాలింగ్ పట్టలు పంపిణీ చేసేవారు. తాగునీటితో పాటు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచేవారు. అత్యవసర సమయా ల్లో, కూలీలు అస్వస్థతకు గురైనప్పుడు, పని చేస్తున్న సమయంలో దెబ్బలు తగిలితే ప్రథమ చికిత్స కోసం మెడికల్ కిట్లు అందుబా టులో ఉంచేవారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మార్చి నుంచి మే నెల వరకు అదనపు అలవెన్సులు ఇచ్చి ప్రోత్సహించేవారు. గడ్డపారలు, పారలు పంపిణీ చేసేవారు. సొంతం గా తెచ్చుకుని వినియోగించే వారికి అదనంగా వేతనం చెల్లించేవారు.

ప్రస్తుతం అమలు తీరు

మజ్జిగ, ఓఆర్ఎస్ మాట అటు ఉంచితే కనీసం తాగునీటి వసతి కూడా కల్పించడం లేదు. టార్పాలిన్ పట్టలు పంపిణీ చేయకపోవడంతో కూలీలు ఎండకు అల్లాడుతూ వానకు తడుస్తున్నారు. ఎండకు, వర్షానికి చెట్ల కింద సేద తీరుతున్నారు. గడ్డపారలు, పారల పంపిణీ లేదు. కూలీలు ప్రమాదాలకు గురైతే ప్రథమ చికిత్సలు అం దడం లేదు. ఐదేళ్లుగా వేసవి భత్యం అందడం లేదు. వేసవిలో 20 నుంచి 30 శాతం అదనంగా అలవెన్సు చెల్లించేవారు. గరిష్ట వేతనం రావాలంటే ఎక్కువ సమయం పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది.

కనీస వసతులు కల్పించడం లేదు



పని ప్రదేశంలో తాగునీటి వసతి కూడా కల్పించడం లేదు. ఇంటి నుం చి బాటిళ్లలో నీరు తెచ్చుకుంటున్నా ఏ మూలకు చాలడం లేదు. ఎం డకు కొంత సేపు సేద తీరుదామన్నా పనులు చేసే చోట నీడ కరువైం ది. నీడ కోసం చెట్లు ఎక్కడున్నాయని వెతుక్కుంటున్నాం. గతంలో నీడ కల్పించుకునేందుకు పది మందికి కలిపి ఒక టార్పాలిన్ పట్ట ఇచ్చేవారు. మెడికల్ కిట్లు అందుబాటులో లేవు. కొండ, గుట్ట ప్రాంతా ల్లో పనులు చేస్తుండడంతో ప్రమాదాలకు గురై గాయపడితే తీవ్ర ఇబ్బందులు పడుతూ ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

- సుబ్రమణ్యం ఉపాధి కూలీ, సానేవారిపల్లె, ములకలచెరువు

అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం

ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో కూలీల కోసం అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. కూలీలకు నీడ కోసం స్థానికంగా దొరికే ప్లాస్టిక్ పట్టలు, కానుగాకుతో నీడ వసతి కల్పించాం. ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశాం. చాలా వరకు మట్టికుండల్లో నీటి వసతి కల్పించాం.

-మధుబాబు, డ్వామా ఏపీడీ, తంబళ్లపల్లె

హుండీ పగులకొట్టి నగదు చోరీ



దుండగులు ధ్వంసం చేసిన హుండీ

కలకడ, మే 20:మండలంలోని నవాబ్‌పేట పంచాయతీలో వెలసిన మల్లికార్జునస్వామి ఆలయంలో దుండగులు హుండీని ధ్వంసం చేసి అందులోని నగదును అపహరించారు. ఆదివారం ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు గుడికి వెళ్లిన అర్చకుడు రఘురామ్‌శర్మ విషయాన్ని గమనించి గ్రామస్థులకు సమాచారం తెలిపారు. హుండీలో 30 వేల రూపాయలు చోరీకి గురైనట్లు పోలీసులకు అందించిన ఫిర్యాదులో అర్చకుడు, గ్రామస్థులు పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తూ ముగ్గురు యువకులు అరెస్టు

మదనపల్లె అర్బన్, మే 20: కర్ణాటక మద్యం తరలిస్తున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్లు మదనపల్లె రూరల్ ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. సోమవారం కర్ణాటక నుంచి బస్సులో కర్ణాటక మద్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి వెళ్లి పీలేరు కు చెందిన సురేంద్రరెడ్డి(34), సాయిప్రసాద్(29), ప్రసాద్(29) అనే వ్యక్తుల నుంచి 28 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం యువకులను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

నక్కలదిన్నె తాండాలో కార్డెన్ సెర్చ్



కార్డెన్ సెర్చ్‌లో పట్టుబడిన సారా విక్రేత

మదనపల్లి అర్బన్ మే 20 : మదనపల్లి పట్టణంలో నక్కలదిన్నె తాండాలో జిల్లా ఎస్పీ కృష్ణారావు, మదనపల్లి డీఎస్పీ ప్రసాద్‌రెడ్డిల ఆదేశాల మేరకు సోమవారం మదనపల్లి వన్ టౌన్ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో తాండాలో సారా విక్రయిస్తున్న మహేష్ నాయక్ భార్య బుక్యే రాములమ్మ (29)ను అరెస్టు చేసి ఆమె వద్దనుంచి 15 లీటర్ల సారాను పోలీసులు స్వాధీనం చేసుకుని ఆమెను రిమాండుకు తరలించారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ వల్లిబస్‌తో పాటూ పోలీసులు పాల్గొన్నారు.

పెద్దశేషవాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు

మదనపల్లె అర్బన్, మే 20: స్థానిక ప్రసన్నవెంకటరమణ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న ఆలయ వార్షికబ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పెద్దశేషవాహనంపై శ్రీనివాసుడు ఊరేగి భక్తులకు దర్శనమిచ్చాడు. ఆలయ ఈవో ఆధ్వర్యంలో వైభవంగా స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తు న్నారు. ఇందులో భాగంగా ఉదయాన్నే శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వ రుడిని ప్రత్యేకంగా అభిషేకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. సాయంత్రం స్వామిని ప్రత్యేక వాహనంలో అంకరించి పెద్దశేషవాహనంపై బండమీదకమ్మపల్లెలో, హంస వాహనంపై నెహ్రూనగర్ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో బీజేపాండు, నాగేంద్ర, సాయిచిత్రభాస్కర, మార్పురి విక్కి, టీడీపీ నాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పెద్దశేషవాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరుడు

ఆశా కార్యకర్తలకు ఎన్నికల అలవెన్స్ మంజూరు చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లి అర్బన్ మే 20 : ఈ నెల 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించిన ఆశా కార్యకర్తలకు వెంటనే ఎన్నికలు అలవెన్సు మంజూరు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు . సోమవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ప్రతి ఆశా కార్యకర్తకు రూ.500 చెల్లించాలన్నారు .రాష్ట్రవ్యాప్తంగా విధులు నిర్వహించిన ఆశా కార్యకర్తలకు ఇప్పటివరకు అలవెన్సులు చెల్లించలేదన్నారు . గతంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించిన వారికి కూడా అలవెన్స్ ఇవ్వలేదన్నారు . కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం నెలకు 1000 రూపాయలు చొప్పున ఆరు నెలలకు నిధులు విడుదల చేసిన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి, అలవెన్సులు చెలించాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పట్టణ కార్యదర్శి తిరుమల రెడ్డప్ప, మురళి, బావాజాన్, హరి తదితరులు పాల్గొన్నారు.

23న మండల సర్వసభ్య సమావేశం

వాల్మీకిపురం, మే 20: వాల్మీకిపురం మండల సర్వసభ్య సమావేశం ఈనెల 23న (గురువారం) ఉదయం 11గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున నియమాలను అనుసరించి సమావేశం జరుగుతుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుంది



టీడీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మే 20: కష్టాల్లో ఉన్న టీడీపీ కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని మదనపల్లె ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నల్లరాజుపల్లెకు చెందిన టీడీపీ నాయకులు ప్రభాకర్, సుధాకర్‌లను షాజహాన్‌బాషా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, మదనపల్లె కూటమి అభ్యర్థి గెలుస్తున్నారనే ఆక్రోశంతో వైసీపీ నాయకులు తమ కార్యకర్తలపై రాళ్లతో దాడిచేసి గాయపరిచారన్నారు. వారి కుటుంబాలకు అన్ని విధాల తాను అండగా ఉంటానన్నారు. కార్యకర్తలపై దాడులకు పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు.

ముగిసిన ముత్యాలమ్మ తిరుణాల ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు

ములకలచెరువు, మే 20: మండలంలోని బురకాయలకోట సమీపంలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారి తిరుణాల ఉత్సవాలు సోమవారం నాటితో ముగిశాయి. ఉత్సవాల్లో ఆఖరి రోజైన సోమవారం ఆలయంలో అభిషేం, పారాయణం, అమ్మవారికి అలంకారం, మహామంగళ హారతి తదితర కార్యక్రమాలు జరిగాయి. అలాగే ఉదయం నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బురకాయలకోట, మద్దినాయనిపల్లె, వేపూరికోట గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఖరీఫ్ సాగుకు రైతన్న సన్నద్ధం

- ఏటేటా పెరుగుతున్న పంట వ్యయం
- కొత్త పెట్టుబడికి కష్టాలు
- ఉద్యానవన పంట సాగుపై ఆసక్తి

కలకడ, మే 20:ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ నెలలో అనుకూలంగా వర్షాలు కురవడంతో పొలాల్లో దుక్కులను చేస్తున్నారు. అనాధిగా ఉమ్మడి చిత్తూరు జిలాలోని పడమటి మండలాలైన కలకడ, కేవీపల్లె, గుర్రంకొండ, వాల్మీకీపురం, పెద్దమండెం, మొలకలచెరువు తదితర మండలాల రైతులు ఈ సీజన్‌లో వేరుశనగ పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేవారు. కానీ దశాబ్ద కాలంగా ఈ పంట సాగు రైతుకు ఆశించిన లాభాలు రాకపోవడంతో ఇతర పంటల సాగుపై దృష్టి సాధించారు. ఈ కోవలో ఉద్యానవన పంటైన టమోటా సాగుకు ఎక్కువ శాతం మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు కొందరు బొప్పాయిని ఎంచుకుంటున్నారు. కలకడ మండలంలో 2022లో 2245 ఎకరాల్లో, 2023లో 1600 ఎకరాల్లో టమోటా సాగు చేశారు. ప్రస్తుతం టమోటా సాగుకు ఎకరానికి రూ.2.05 లక్షలు పెట్టుబడి అవుతుందని రైతులు తెలుపుతున్నారు. పంట సంరక్షణకు ఆధునిక పద్ధతులను అవలంభించడం వలన ఖర్చు మరింత పెరిగిన ఆశ్చర్యపోనవసరం లేదని రైతులంటున్నారు. ఇంత చేసిన మాయా జూదంలాటి టమోటా సాగు తలకు అంటుకుని ఏటేటా అప్పుల పాలు చేస్తుండంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు చెబుతున్నారు. గత ఐదేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల, ధరల పతనం నష్టాలను మూటగట్టుకున్నట్లు తెలిపారు. అదే విధంగా మార్కెట్‌లో నకిలీ మందులు, నర్సరీలో దొరికే నాసిరకం నారుతో నష్టపోతున్నట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి గడ్డు స్థితిలో కొత్త పంటల సాగు అవస్థలు మొదలైనట్లు వాపోతున్నారు. మునుపు చేసిన అప్పులు పేరుకుపోగా మళ్లీ అప్పులు దొరకడం కష్ట తరంగా మారిందన్నారు. ఈ తరుణంలో బ్యాంకులు దయతలచి విరివిగా పంట రుణాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. అలాగే పంట వ్యయం భారం కాకుండా అధికార యంత్రాంగం డ్రిప్ పరికరాలు, ఎరువులు, మందులు సబ్సిడీ అందేలా చర్యలు తీసుకుని ఆదుకోవాలని కోరుతున్నారు.



దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేసిన పొలం

పెట్టుబడి సొమ్ములేదు



ఖరీఫ్‌లో పంట సాగు చేయాలంటే పెట్టుబడికి చేతిలో డబ్బులు లేవు. ఆనవాయితీగా గత ఖరీఫ్ లో 1.5 ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశా ను. ఇందుకు గాను రూ.3.5 లక్షలు దాకా ఖర్చు అయింది. పంట చేతికి వచ్చిన సమయానికి ధరలు లేవు. సరుకు అమ్మగా వచ్చిన నగదు కూలీలు, రవాణా ఖర్చులకే సరిపోయాయి. ఈ కారణంగా నష్టాలు మూట గట్టుకున్న ప్రభుత్వం నుంచి వచ్చిన సాయమేమి లేదు.

-బాలాజి, రైతు, కలకడ మండలం

పంట వ్యయం భారీగా పెరిగింది



టమోటా పంట సాగుకు వేయం భారీగా పెరిగింది. డ్రిప్‌ల దగ్గర నుంచి పంట చేతికి వచ్చేదాకా ఎకరానికి పెట్టుబడి రూ.2.5 లక్షలు అవుతుంది. గత ఏడాది ఒక ఏకరంలో టమోటా పంట సాగు చేయ గా అసలు కూడా చేతికి దక్కలేదు. కొత్తగా పంట సాగు చేయాలంటే భయంగా ఉంది. ప్రభుత్వం రైతులకి సబ్సిడీపై మందులు, ఎరువులు, డ్రిప్ పరికరాలను అందించి ఆదుకోవాలి.

-గిరిధర్, రైతు, కలకడ, మండలం

11 మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

- విధులకు గైర్హాజరుపై రేపటిలోగా సంజాయిషీ ఇవ్వాలని ఆదేశం

ఆంధ్రజ్యోతి స్పాట్

ములకలచెరువు, మే 20: ముందస్తు సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైన గ్రామ సచివాలయ సిబ్బందిపై అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నెల 19వతేదీన 'ఆంధ్రజ్యోతి' చౌడసముద్రం, కాలువపల్లె, గూడుపల్లె, పాత ములకలచెరువు సచివాలయాల్లో విజిట్ నిర్వహించింది. దీనిపై ఈ నెల 20వ తేదీన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో సమయపాలన ఏదీ..?, ఉద్యోగులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు అన్న శీర్షికన వార్త ప్రచురిత మైంది. దీనిపై ఎంపీడీవో పోలయ్య విచారణ చేపట్టి హాజరు పట్టికను తనిఖీ చేశారు. సిబ్బంది ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా విధులకు హాజరుకాకపోవడం, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన 11 మంది సిబ్బందిని గుర్తించారు. విధులకు హాజరుకాని కాలువపల్లె, చౌడసముద్రం, గూడుపల్లె, పాత ములకలచెరువు సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది అంజినాయక్, వెంకటేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, మౌనిక, కవిత, అనీల్‌కు మార్, ప్రశాంత్, ఫిరోజ్, వెంకటరమణలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో పోలప్ప తెలిపారు. ఎందుకు విధులకు హాజరుకాలేదో తమ ఎదుట హాజరై ఈ నెల 22వ తేదీ లోగా సంజాయిషీ ఇవ్వాలని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. సంజాయిషీ ఇవ్వకుంటే క్రమ శిక్షణా చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని తెలిపారు. దీనిపై ములకలచెరువు, చౌడసముద్రం పంచాయతీ కార్యదర్శులు ఇబ్రహీం, ఫిరోజ్‌లు వివరణాత్మక నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు విధులకు హాజరుకాని సిబ్బందికి మే నెల జీతం బిల్లులు నిలుపుదల చేయ వల్సిందిగా ఆదేశించారు.

అక్రమ బ్లాస్టింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



బ్లాస్టింగ్ ఆపాలని కాలనీవాసులతో కలిపి నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

మదనపల్లె అర్బన్, మే 20: అక్రమ బ్లాస్టింగ్ చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అమ్మచెరువుమిట్ట వద్ద అక్రమంగా నిర్వహిస్తున్న బ్లాస్టింగ్ పనులను ప్రక్కనున్న కాలనీవాసులతో కలిసి సీపీఎం నాయకులు పరిశీలించారు. అక్కడే స్థానికులతో కలిసి నిరసన చేపట్టారు. అక్రమ బ్లాస్టింగ్ ఆపాలని, కబ్జాదారులకు అండగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఐటీయూసీ నాయకుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ మదనపల్లె మండలం, కోళ్లబైలు రెవెన్యూ గ్రామంలో భూ కబ్జాలు, అక్రమాలకు అంతేలేకుండాపోయిందన్నారు. సర్వేనెంబరు 529లో ఎలాంటి అనుమతులు లేకుండా అర్థరాత్రి ఇళ్లమధ్యలో ఉన్న గుట్టను బ్లాస్టింగ్ చేయడం వల్ల భూమి కంపించి ఇళ్లు కదులుతున్నట్లు స్థానికులు ఆందోళన చెందుతున్నారన్నారు. పక్కనే చున్న వెలుగు ప్రత్యేక వికలాంగుల క్షేత్రంలో మానసిక వికలాంగులు, వృద్ధులు భయభ్రాంతులకు గురవుతున్నట్లు వాపోయారు. ఈ విషయంగా జిల్లా కలెక్టర్, మదనపల్లె ఆర్డీవో స్పందించి అక్రమబ్లాస్టింగ్‌ను ఆపాలని లేనిపక్షంలో ప్రజలందరినీ కూడగట్టి పెద్దఎత్తున్న ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాలనీ, బృందావన్ కాలనీ, జగన్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంట సాగుకు వేరుశనగ విత్తనకాయలు సిద్ధం



రెడ్డివారిపల్లికు చేరిన వేరుశనగ కాయలు

నిమ్మనపల్లి, మే 20: ఈ ఏడాదిలో ఖరీఫ్‌లో పంట సాగు చేసే రైతుల కోసం సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు నిమ్మనపల్లెకు వచ్చినట్లు మండల వ్యవసాయాధికారి మురళీమోహన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలానికి 1600క్వింటాళ్ల సబ్సిడీ వేరు శనగ విత్తనకాయలు మంజూరైనట్లు తెలిపారు. వాటిలో కేసిక్స్ రకం 1100 క్వింటాళ్లు, నారాయణి రకం 500క్వింటాళ్లు వచ్చినట్లు తెలిపారు. మండలంలోని 12ఆర్బీకే కేంద్రాలకు విత్తనకాయలు వచ్చాయన్నారు. దీంతో విత్తనకాయలు రైతులకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అలాగే వేరుశనగ విత్తనకాయలు కావసిన రైతులు సంబంధిత ఆర్బీకేలలో పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డులను ఇచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీతో రైతులకు అందిస్తున్న విత్తనకాయలు కేసిక్స్ రకం ధర రూ.1746, నారాయణి రకం ధర రూ.1710గా ఉన్నాయన్నారు. ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు విత్తన కాయల పంపిణీ జరుగతుందని ఏవో తెలిపారు.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



104లో తనిఖీలు చేస్తున్న అడిషినల్ డీఎంహెచ్‌వో లక్ష్మీ

నిమ్మనపల్లి, మే 20: మండలంలోని గర్భిణులకు ప్రతి నెలా తప్పనిసరిగా మెరుగైన వైద్య సేవలు అందించాలని అడిషినల్ డీఎంహెచ్‌వో లక్ష్మీ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆమె ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ పందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు అన్ని పరీక్షలు తప్పసరిగా చేసి వారికి కావలసిన మందులను ఇవ్వాలన్నారు. అలాగే హైరిస్క్ కలిగిన గర్భిణులను సంబంధిత ఆసుపత్రులకు తరలించాలని తెలిపారు. అలాగే సిబ్బంది హాజరుపట్టికను తనిఖీ చేసి మందుల వాడకంపై సిబ్బందికి సలహాలు ఇచ్చారు. అనంతరం కొమ్మిరెడ్డిగారిపల్లెలో వున్న 104వాహనాన్ని తనిఖీ చేసి రోగులకు సరియైన చికిత్సలు అందుతున్నాయా? లేదా? అని ఆరాతీశారు. అలాగే రోజువారి పేషంట్ల పట్టికను తనిఖీ చేసి ప్రతి రోగికి మెరుగైన చికిత్సలు అందించాలని ఆమె ఆదేశించారు. అలాగే సిబ్బంది సమయ పాలన పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


మిట్స్ అధ్యాపకురాలికి జేష్ఠ అవార్డు ప్రదానం



అధ్యాపకురాలు కుసుమ

కురబలకోట, మే 20: మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన అధ్యాపకురాలు ప్రొఫెసర్ కుసుమ జేష్ఠ ఆవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో సీఎస్ఈ విభాగానికి చెందిన ప్రొఫెసర్ కుసుమ వైజాగ్‌లోని ఆంధ్ర యూనివర్సిటీలో జాతీయస్థాయిలో జరిగిన భారత్ ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును అందుకున్నారన్నారు. కాగా ఆమె రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెక్టార్‌లో చేసిన కృషికి గాను ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేశారన్నారు. కాగా అవార్డు సాధించిన ప్రొఫెసర్ కుసుమను కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి కల్పన తదితరులు అభినందించారు.

ఇంటర్ వర్సిటీ పోటీలకు పీలేరు విద్యార్థి ఎంపిక



పోటీలకు ఎంపికైన విష్ణువర్ధన్ రెడ్డి

పీలేరు, మే 20: ఇంటర్ వర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు తమ కళాశాలకు చెందిన విద్యార్థి విష్ణువర్ధన్ రెడ్డి ఎంపికైనట్లు పీలేరులోని సీఎస్ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చింతల విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. తమ కళాశాలలో బీకామ్ మొదటి సంవత్సరం చదువుతున్న విష్ణువర్ధన్ రెడ్డి, ఇటీవల యూనివర్సిటీ పరిధిలో జరిగిన పోటీలలో ప్రత్యేక ప్రతిభ కనబరిచాడన్నారు. దాంతో అతనిని వర్సిటీ అధికారులు ఈ నెల 31న చెన్నైలో జరిగే ఇంటర్ వర్సిటీ పోటీలకు ఎస్వీయూ జట్టులోకి ఎంపిక చేశారని వివరించారు. వర్సిటీ జట్టుకు ఎంపికైన విద్యార్థి విష్ణువర్ధన్ రెడ్డిని కళాశాల అధ్యాపకులు, సహచర విద్యార్థులు అభినందించారు.

బాహుదా నదిలో అక్రమ ఇసుకను ఆపేవారు లేరా..?



మంచూరు గ్రామం బాహుదా కాలువలో ఇసుక అక్రమ తవ్వకాల దృశ్యం

వాల్మీకిపురం, మే 20: ఎన్నికలు అయిపోయాయ్ ఏముందిలే అనుకున్నారో ఏమోగానీ వాల్మీకిపురం మండలంలోని మంచూరు గ్రామ సమీపాన బాహుదా నదిలో పట్టపగలే ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నా పట్టించుకునేవారు లేరు. దీంతో ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకునే వారు లేరా? అంటూ గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. గ్రామ సమీపంలోని బాహుదా కాలువ ప్రాంతాన్ని గుల్ల చేస్తున్నారని గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టపగలే ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలకు పాల్పడడం, రహస్య ప్రాంతాలలో డంపింగ్ చేసి రాత్రి సమయాలలో టిప్పర్ల ద్వారా బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పోలీసు, ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. బాహుదా కాలువ ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.